ఎవతో మహిళలకే ప్రమాదం ఎక్కువ

- యుఎస్‌లో 1.2 కోట్ల ఉద్యోగాలపై ప్రభావం
- నల్లజాతీయులకు ప్రతికూలత
- మెకెన్సీ రిపోర్ట్

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 259 | విజయవాడ, శనివారం 29 జులై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 29 July 2023 | Rs

హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం

- సిఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు హాజరు

లోపలి పేజీలో..

చర్చ లేదు... ఓటింగ్ లేదు

అరగంటలో మూడు బిల్లులు ఆమోదం

ఇది రాజ్యాంగ వ్యతిరేకం, చట్ట విరుద్ధం: ప్రతిపక్షాలు

ఉభయ సభలూ సోమవారానికి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానం చర్చకు రాక మునుపే అరగంటలో మూడు బిల్లులను ఎలాంటి చర్చ, ఓటింగ్ లేకుండానే ప్రభుత్వం శుక్రబారం లోక్‌సభలో ఆమోదింపజేసుకుంది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే అరగంట వ్యవధిలోనే మూడు బిల్లులు సభ ముందుకు తీసుకురావడం, ఆమోదించుకోవడం చకచకా జరిగిపోయింది. ఇది రాజ్యాంగ వ్యతిరేకం, చట్ట విరుద్ధమని ప్రతిపక్షాలు విమర్శించాయి. మణిపూర్ పై ప్రధాని నోరు విప్పాలని కోరుతూ ఉభయసభల్లో శుక్రవారం ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సోమవారానికి వాయిదా వేశారు.

లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళనను చేపట్టాయి. ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు చేబూని నినాదాలు హోరెత్తించారు. కాంగ్రెస్ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ 1978 మే 10న పెట్టిన అవిశ్వాస తీర్మానంపై స్పీకర్ అనుమతించిన వెంటనే చర్చ జరిగిందని గుర్తు చేశారు. దీనికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి బదులిస్తూ అన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని, పది రోజుల్లో అవిశ్వాసంపై ఎప్పుడైనా చర్చించవచ్చున్నారు. ప్రతిపక్ష ఎంపిలు నినాదాలతో హోరెత్తించడంతో సభ ప్రారంభమైన నాలుగు నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన కొనసాగించారు. కేంద్ర

మంత్రి ప్రహ్లాద్ జోషి గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లును చర్చకు పెట్టారు. కేవలం ఇద్దరు (బిజెపి, వైసిపి) ఎంపిలు మాత్రమే మాట్లాడిన తరువాత, కేంద్ర మంత్రి సమాధానం ఇవ్వడం, బిల్లు ఆమోదించినట్లు ప్యానల్ స్పీకర్ రాజేంద్ర అగర్వాల్ ప్రకటించడం నిమిషాల్లోనే జరిగి పోయింది. అనంతరం కేంద్ర మంత్రి మనసుఖ్ మాండవీయా నేషనల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కమిషన్ బిల్లును, నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లును వెంట వెంటనే చర్చకు పెట్టడం, ఆమోదించుకోవడం నిమిషాల్లోనే జరిగింది. ఈ మూడు బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు. ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఎటువంటి చర్చ, ఓటింగ్ లేకుండా రాజ్యాంగ వ్యతిరేకంగా, చట్ట విరుద్ధంగా బిల్లులు ఆమోదించుకుంటున్నారని ధ్వజమెత్తాయి. అవిశ్వాస తీర్మానం పెండింగ్‌లో ఉన్నప్పుడు, ఎటువంటి విధానపరమైన అంశాలు అనుమతించకూడదని మిగతా 5లో

సభలకు విద్యార్థుల తరలింపు చట్టవిరుద్ధం

- ఇద్దరు ఉన్నతాధికారులకు హైకోర్టు నోటీసులు

అమరావతి : రాజకీయ సభలకు విద్యార్థుల తరలింపు చట్టవిరుద్ధమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కేసులో ఇద్దరు ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. పాఠశాల విద్యార్థులను రాజకీయ సభలకు తరలించటంపై కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను ఆదివాసి గిరిజన చైతన్య వేదిక అధ్యక్షులు చొక్కారావు హైకోర్టులో దాఖలు చేశారు. విద్యార్థులను రాజకీయ సమావేశాలకు తరలించరాదని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని, కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం ఎపి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్, హోంశాఖ కార్యదర్శి హరీశ్ గుప్తాకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు 4 వారాలకు వాయిదా వేసింది.

కోర్టు సూచనలిస్తే పాటిస్తాం : మంత్రి బొత్స

హైకోర్టు నోటీసులు ఇవ్వడంపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. అమ్మ ఒడి సభకు విద్యార్థులు, తల్లిదండ్రులు రావడం తప్పుకాదని అన్నారు. లేదంటే ఇలాంటి కార్యక్రమాలకు సినీ నటులు వస్తారా? అని ప్రశ్నించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల రాకపై కోర్టు సూచనలిస్తే పాటిస్తామని తెలిపారు.

గోదావరి, కృష్ణా ఉధృతం

భద్రాచలంలో మూడవ, రాజమహేంద్రవరంలో రెండవ ప్రమాద హెచ్చరికలు

విలీన మండలాలను, లంకలను చుట్టుముట్టిన వరద నీరు

ప్రజాశక్తి- యంత్రాంగం

గోదావరి, కృష్ణా నదుల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. వాయుగుండం కారణంగా ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తుండడంతో వరద తాకిడి మరింత ఎక్కువైంది. వారం రోజులుగా కొనసాగుతోన్న వరద గోదావరి నదీ పరివాహక ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా విలీన మండలాల ప్రజలకు, లంక గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. భద్రాచలం వద్ద తగ్గినట్టే తగ్గిన వరద శుక్రవారం ఉదయం నుంచి మళ్లీ పెరిగింది. గురువారం సాయంత్రానికి 46 అడుగులకు తగ్గింది. దీంతో, రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. శుక్రవారం రాత్రికి 53.10 అడుగులకు మళ్లీ పెరిగింది. దీంతో, ఇక్కడ మళ్లీ మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమలోని పరివాహక ప్రాంతాలు, లంకలను వరద నీరు చుట్టుముట్టింది.. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద 13.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో, ఈ బ్యారేజీ 175 గేట్ల ద్వారా 13 లక్షల క్యూసెక్కుల జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. 24 గంటలుగా ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక అమల్లోనే ఉంది. తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని పాత

తమను ఆదుకోవాలంటూ జల దీక్ష చేపట్టిన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కొమ్మూరు గ్రామస్తులు

బ్రిడ్జి వద్ద 14.90 మీటర్ల నీటిమట్టం ఉంది.

నీట మునిగిన లోతట్టు లంక గ్రామాలు

కోనసీమ లంక గ్రామాలను వరద నీరు చుట్టిముట్టింది. లోతట్టు లంక గ్రామాల్లోని ఇళ్లలోకి వరద చేరింది. కాజ్‌వేలు నీటమునిగాయి. సఖినేటిపల్లి మండలంలోని అప్పనారామునిలంక, సఖినేటిపల్లిలంక, కొత్తలంక, టేకిశెట్టిపాలెంలోని కొంతభాగం, మలికిపురం మండలంలోని రామరాజులంక, బాడవ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. టేకిశెట్టిపాలెంలో నివాసాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోవడంతో ఏటిగట్టుపై గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు.

పోలవరం ఎమ్మెల్యే నిలదీత

వరద బాధితులను పరామర్శించేందుకు వేలేరుపాడు వచ్చిన పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజును స్థానికులు అడ్డుకున్నారు. తమకు పరిహారం ఎప్పుడిస్తారంటూ నిలదీశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తానని ఎంఎల్‌ఎ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కివ్వాక పునరావాస కాలనీకి 200 కుటుంబాల తరలింపు

ఏలూరు జిల్లా పోలవరం ఎగువ కాఫర్ డ్యాం వద్ద 34.300 మీటర్ల మిగతా 2లో

ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

ప్రకాశం బ్యారేజీకి శుక్రవారం సాయంత్రం వరద ప్రవాహం భారీగా పెరిగింది. ఎగువ నుంచి 2.68 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా మొత్తం అన్ని గేట్లు ఎత్తి వేసి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతోపాటు పులిచింతల దిగువన, ప్రకాశం బ్యారేజి ఎగువన కురిసిన వర్షాలతో మున్నేరు, కట్టలేరు, బుడమేరు, పాలేరు తదితర ప్రాంతాల నుంచి వరద వస్తోంది. దీంతో, వరద పెరిగి మూడు లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. సాగర్‌కు దిగువన, పులిచింతల ఎగువన కురిసిన వర్షాలతో పులిచింతల జలాశయానికి సాయంత్రం 1,28,171 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. నాగార్జున సాగర్ నుంచి 6,290 క్యూసెక్కుల నీటిని కాల్వలకు విడుదల చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి

- సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

లోపలి పేజీలో..

కువైట్‌లో ఐదుగురి ఉరితీత

కువైట్ సిటీ : కువైట్ ప్రభుత్వం గురువారం ఐదుగురిని ఉరి తీసింది. కువైట్‌లో మసీదుపై జరిగిన ఇస్లామిక్ స్టేట్ గ్రూపు ఆత్మాహుతి దాడితో ప్రమేయమున్న నేరస్తుడు కూడా ఈ ఐదుగురిలో వున్నాడని పబ్లిక్ ప్రాసిక్యూషన్ తెలిపింది. ఈ దాడిలో 26మంది చనిపోయారు. పొరుగున వున్న సౌదీ అరేబియాతో పోలిస్తే కువైట్‌లో పలువురిని ఒకేసారి ఉరి తీయడం చాలా అరుదు. ఐదేళ్ళపాటు విధించిన మారటోరియాన్ని ఎత్తివేసిన తర్వాత గతేడాది నవంబరులో ఏడుగురిని ఉరి తీశారు ఆ తర్వాత మళ్ళీ ఇప్పుడే ఈ మరణ శిక్షలు అమలయ్యాయి. కువైట్ సెంట్రల్ జైల్లో ఐదుగురి మరణ శిక్ష అమలును పర్యవేక్షించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూషన్ ఒక ప్రకటనలో తెలిపింది. వీరిలో చాలామంది హత్యలకు పాల్పడినవారే. 2015లో శుక్రవారం ప్రార్ధనల సందర్భంగా నగరంలోని షియా మసీదుపై బాంబు దాడి జరిగింది. ఆ దాడి కేసులో ప్రధాన దోషి అబ్దుల్ రహమాన్ సాబా సాద్ ఈ ఐదుగురిలో వున్నాడు. కువైట్ చరిత్రలోనే అత్యంత దారుణమైన దాడి ఇది. ఆత్మాహుతి దాడికి పాల్పడిన బాంబర్‌ను మసీదు వరకు తీసుకెళ్ళి, సౌదీ సరిహద్దు సమీపం నుండి పేలుడు పదార్ధాల బెల్ట్‌ను తీసుకువచ్చిన వ్యక్తి అబ్దుల్ రహమాన్. కువైట్‌లో మరణ శిక్షలు పెరిగిపోతున్నాయనడానికి ఇదొక ఉదాహరణ అని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వ్యాఖ్యానించింది.

మహిళా రక్షణలో ప్రభుత్వాలు విఫలం

హింసపై హిందూపురం, విశాఖ నుంచి ఐద్వా ఆధ్వర్యాన పోరుయాత్రలు ప్రారంభం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

దేశంలో, రాష్ట్రంలో చిన్నారులపైనా, మహిళలపైనా హింస రోజురోజుకూ పెరుగుతోందని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మహిళల రక్షణ కోసం ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని రెండు ప్రాంతాల నుంచి మహిళల పోరుయాత్ర రాష్ట్ర జాతాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి వద్ద ఒక యాత్రను కార్మికురాలు అక్కమ్మ, విశాఖ నగరంలోని ఎల్ఐసి కార్యాలయ సమీపంగల అంబేద్కర్ విగ్రహం వద్ద మరో యాత్రను సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ జెండా ఊపి ప్రారంభించారు. మహిళలపై హింస నివారణకు నిపుణులతో అధ్యయన కమిషన్ ఏర్పాటు చేయాలని, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని తదితర డిమాండ్‌తో చేపట్టిన ఈ రెండు యాత్రలూ ఆయా జిల్లాల్లో పర్యటించి విజయవాడ చేరుకోనున్నాయి. ఆగస్టు ఎనిమిదిన విజయవాడలో బహిరంగ సభ జరగనుంది. యాత్రల ప్రారంభ సభల్లో హిందూపురంలో డి.రమాదేవి, విశాఖలో బి.ప్రభావతి మాట్లాడారు. మహిళల

హిందూపురంలో ప్రారంభమైన మహిళల పోరుయాత్రలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

రక్షణకు చట్టాలు చేయడంతోనే సరిపోదని, వాటిని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపిని అరెస్టు చేసినట్లు చేసి బెయిల్‌పై విడుదల చేశారన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారం చేసి హత్యలకు పాల్పడం వంటి ఘటనపై ప్రధాని మోడీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. చివరకు సుప్రీం కోర్టు స్పందించే వరకూ కేసులు నమోదు చేయలేదని తెలిపారు. బిజెపి ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని తిరిగి సమాజంపై, మహిళలపై బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. మహిళలపై హింసకు, దాడులకు మత్తు పదార్థాలు, మద్యం కారణమవుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే మహిళలపై జరుగుతున్న నేరాల అధ్యయనానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మీడియా మానటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి హింస, అశ్లీలత, అసమానతలు ప్రేరేపించే మిగతా 2లో

గోన్సాల్వేజ్, ఫెరీరాలకు బెయిల్

- ఐదేళ్ల జైలు తరువాత బీమా కొరేగావ్ కేసులో ఊరట

న్యూఢిల్లీ : ఐదేళ్ల జైలు జీవితం అనుభవించిన తరువాత బీమా కొరేగావ్ కేసులో నిందితులు వెర్నాన్ గోన్సాల్వేజ్, అరుణ్ ఫెరీరాలకు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిలు మంజూరు చేసింది. ఈ నిందితులిద్దరూ ఐదేళ్ల నుంచి జైలులో ఉన్నారని, వీరిపై నమోదైన అభియోగాలు తీవ్రంగా ఉన్నా.. బెయిల్‌కు అర్హమైనవేనని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ సుధాన్షు ధులియాతో కూడిన ధర్మాసనం బెయిల్ ఉత్తర్వుల్లో పేర్కొంది.

వెర్నాన్ గోన్సాల్వెజ్, అరుణ్ ఫెరీరా 2018 ఆగస్టు నుంచి జైలులో ఉన్నారు. వీరిపై చట్ట వ్యతిరేక కార్యక్రమాలు (నిరోధక) చట్టం (ఉపా) 1967 కింద అభియోగాలు నమోదయ్యాయి. నిందితులు ఐదేళ్ల నుంచి జైలులో ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని బెయిల్ విజ్ఞప్తిని అంగీకరిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. అభియోగాలు తీవ్రంగా ఉన్నా. ఆ కారణంతో బెయిల్‌ను నిరాకరించలేమని స్పష్టం చేసింది. ఎన్ఐఎ చేసిన అభియోగాలను ప్రస్తావిస్తూ.. కేసు తీర్పు వచ్చే వరకూ నిందితులకు నిరంతర నిర్బంధాన్ని సమర్థించలేమని తెలిపింది. అలాగే బెయిల్ మంజూరు చేస్తూ కొన్ని షరతులను విధించింది. ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా

వెర్నాన్ గోన్సాల్వేజ్, అరుణ్ ఫెరీరా

నిందితులు మహారాష్ట్ర విడిచి వెళ్లకూడదని ఆదేశించింది. అలాగే పాస్‌పోర్టులను అప్పగించాలని, చిరునామాలను ఎన్ఐఎ విచారణ అధికారికి తెలియచేయాలని పేర్కొంది. నిందితులిద్దరికీ మొబైల్ ఫోన్లు ఇవ్వబడుతుందని, ఈ ఫోన్లు ఎల్లప్పుడూ ఆన్ చేసి ఉంచాలని, లోకేషన్ స్టేటస్‌ను 24 గంటలూ యాక్టివ్‌గా ఉంచాలని ఆదేశించింది.

2017 డిసెంబరు 31న పూణేలో జరిగిన ఎల్గార్ పరిషత్ సమావేశం, మరుసటి రోజున బీమా-కొరేగావ్ యుద్ధ స్మారకం వద్ద అల్లర్ల నేపథ్యంలో వీరిపై రాజద్రోహం కేసు నమోదు చేశారు.ఈ కేసులో వెర్నాన్ గోన్సాల్వెజ్, అరుణ్ ఫెరీరాలతోపాటు సుధా భరద్వాజ్, పి.వరవరరావు, గౌతమ్ నవ్‌లఖాల పూణె పోలీసులు అరెస్టు చేశారు.

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌గా శంకరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌గా దాడిచిలుక వీర గౌరీ శంకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ బందరురోడ్డులో ఉన్న ఆర్‌అండ్‌బి బిల్డింగ్‌లోని ఎస్‌టి కమిషన్ కార్యాలయంలో ఆయనతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పటి వరకూ ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న రవిబాబు ఎమ్మెల్సీగా ఎన్నికవడంతో ఆయన స్థానంలో శంకరరావును నియమించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు అభినందించారు. డివిజిది పార్వతీపురం జిల్లా సాలూరు మండలం

పాలికవలస. 1999లో పార్వతీపురం నుండి తెలుగుదేశం పార్టీ తరుపున ఎంపిగా గెలిచిన శంకరరావు 2021లో వైసిపిలో చేరారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గిరి జనుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, అనధికారులు ఆయన్ను అభినందించారు.

ప్రొఫెసర్ హోజింగ్‌కు సంఘీభావం

- 32 మంది స్వదేశీ, విదేశీ విద్యావేత్తల సంయుక్త ప్రకటన

లోపలి పేజీలో..

ప్రత్యేకహోదా కోసం చలో ఢిల్లీ

- రౌండ్ టేబుల్ సమావేశ నిర్ణయం
- బిజెపికి దూరం జరగాలని వైసిపి, టిడిపిలకు విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా సాధన కోసం విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు, కలిసి వచ్చే రాజకీయపార్టీలతో త్వరలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించాలని ప్రత్యేకహోదా సాధనా సమితి నిర్ణయించింది. మేధావుల సంఘం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ అధ్యక్షతన విజయవాడ బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. నిరవధిక దీక్ష చేయాలని వచ్చిన ప్రతిపాదనలపై అన్ని పక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయాన్ని ఈ సమావేశం వ్యక్తం చేసింది. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపికి అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు దూరం జరగాలని విజ్ఞప్తి చేసింది. లేనిపక్షంలో రాష్ట్రానికి ద్రోహం చేసిన వారిగా గుర్తించాల్సి వస్తుందని రౌండ్‌టేబుల్ సమావేశం హెచ్చరించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు(వైవి)

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

మాట్లాడుతూ రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేసిందన్నారు. విభజన చట్టం హామీలు, ప్రత్యేకహోదా, విశాఖ ఉక్కు గురించి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా నవ్విపోదురుగాక నాకేమిటి సిగ్గు అన్నట్లు బిజెపి వ్యవహరిస్తోందన్నారు. వైసిపి, టిడిపిలు రాష్ట్ర ప్రయోజనాలను పక్కన బెట్టి బిజెపి ఏమి చెబితే వాటికి తలొగ్గుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి ఒకరినొకరు వ్యతిరేకిస్తున్నట్లు నటిస్తూ బిజెపికి పార్లమెంటులో మద్దతు ఇవ్వడమంటే రాష్ట్రానికి అన్యాయం చేయడం కాదా? అని ఆయన ప్రశ్నించారు. హోదా, విభజన హామీల అమలు చేయకుండా బిజెపి వ్యవహరిస్తుంటే నిలదీయాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. ప్రత్యేకహోదా సాధనతో పాటు పోలవరం నిర్వాసితులకు అండగా సిపిఎం నిలుస్తుందన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారామ్ మాట్లాడుతూ పునర్విభజన చట్టం అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి తుంగలో తొక్కింద న్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. పోలవరం ప్రాజెకు సాంకేతిక అంశాలపై మాత్రమే రాష్ట్రంలో చర్చ జరుగుతోందన్నారు. సర్వస్వాన్ని త్యాగం చేసి నిర్వాసితులుగా మారిన గిరిజనుల గొంతుకను విజయవాడలో సిపిఎం వినిపించిందన్నారు. పోలవరం పూర్తి బాధ్యత కేంద్రానిదే అయినప్పటికీ నిర్మాణానికి నిధులు ఇస్తామని చెబుతున్నారే తప్ప నిర్వాసితులకు నిధులు ఇవ్వక పోయినా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం దురదృష్టకరమన్నారు. గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు కోసం కొత్తవలసలో 525 ఎకరాల భూమి మిగతా 2లో

1 నుండి ప్రాజెక్టుల సందర్శన

- ప్రభుత్వ నిర్వాకాన్ని అక్కడే బట్టబయలు చేస్తా
- జగన్ విధానాలే పోలవరానికి శాపం
- విలేకరుల సమావేశంలో చంద్రబాబు

లోపలి పేజీలో..

జెడి రైతుల గోడు పట్టదా?

- రూ.16 వేలకు ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలి
- 24 గం॥ నిరాహార దీక్ష ప్రారంభంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

అటవీ పర్యావరణ సవరణ చట్టాన్ని రద్దు చేయండి

- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన అటవీ పర్యావరణ సవరణ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఆ చట్టం వల్ల దేశంలోని ఆదివాసీలకు తీవ్ర నష్టం కలిగిస్తుందనిఅన్నారు. విశాఖలోని జగదాంబ దరి ఎన్‌పిఆర్ భవనంలో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం పి.అప్పలనర్స అధ్యక్షతన శుక్రవారం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేంద్ర మాట్లాడుతూ.. నూతన చట్టం అమలైతే ఏజెన్సీలోని గ్రామ సభలకు అధికారం లేకుండా పోతుందన్నారు. సహజ వనరుల మీద గిరిజనులు కోల్పోతారని తెలిపారు. సహజ వనరులు, అడవులను ప్రయివేటు, బడా సంస్థలకు ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు సాగిస్తోందని విమర్శించారు. యూనియన్ సివిల్ కోడ్ వల్ల ఆదివాసీలకు తీవ్ర నష్టం చేకూరుతోందన్నారు. ఆదివాసీల సంస్కృతి, ఆచారాలు ధ్వంసమవుతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో యుసిసి అమలును తమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. మణిపూర్‌లో ఆదివాసీలపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సాగిస్తున్న మారణ హోమాన్ని ఖండించారు. పోలవరం నిర్వాసితులు ప్రస్తుతం వరదల్లో దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, వారికి నిత్యావసర సరుకులను తక్షణమే ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం పూర్తి స్థాయిలో అందించి న్యాయం చేయాలని కోరారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ హక్కుల దినంగా జరపాలని నిర్ణయించామని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి నూతనంగా కోలక అవినాష్, మండంగి లక్ష్మణ్, సీదరి అప్పారావు, మండంగి రమణ రాష్ట్ర కమిటీకి ఎన్నికైనట్టు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు కిముడు చిన్నంనాయుడు, జివి.రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదు

- పోతుల సునీత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే ఓర్వలేక తెలుగుదేశం మహిళలను అడ్డం పెట్టుకొని దుష్ప్రచారం చేస్తోందని వైసిపి మహిళా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పోతుల సునీత విమర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళల సంరక్షణ కోసం దిశలాంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. మహిళలు ఎక్కడ ఆపదలో వున్నా ఒక్క ఫోన్‌కాల్‌తో వారికి రక్షణ కల్పించే వ్యవస్థను తెచ్చామని అన్నారు. ఎన్‌సిఆర్‌బి రిపోర్టును కూడా తప్పుదారి పట్టించి దుష్ప్రచారానికి దిగుతున్నారని విమర్శించారు.

బిసిలకు చేసిందేమీ లేదు

- కిమిడి కళా వెంకట్రావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాలుగన్నరేళ్ల పాలనలో జగన్ బిసిలకు చేసిందేమీ లేదని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు కిమిడి కళావెంకట్రావు విమర్శించారు. టిడిపి హయాంలో కార్పొరేషన్ల ద్వారా రుణాలు, సబ్సిడీలు రాయితీలు ఇచ్చి చేతి వృత్తుల్ని ప్రోత్సహించామని, జగన్ అన్నీ రద్దు చేసి బిసిలను అణగదొక్కుతున్నారని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవులు, పనుల్లో రిజర్వేషన్లు అంటూ మాయ చేస్తున్నారని తెలిపారు. చిన్న పదవుల్లో రిజర్వేషన్లు అమలు చేసి ఏపిఐఐసి, టిటిడి, సలహాదారులు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లలో రిజర్వేషన్ ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

రేషన్, పెన్షన్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా బిసి బడ్జెట్‌లో చూపించడానికి సిగ్గుపడాలని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్లు చంద్రబాబు కల్పిస్తే వాటిని కుదించి.16,800 మందికి పదవులు దూరం చేశారని పేర్కొన్నారు. 32 మంది ఎంపిలు ఉండి కూడా జనగణనపై కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు.

టిడిపిలో పరిశోధన, సమాచార కమిటీ ఏర్పాటు

టిడిపిలో పరిశోధన, సమాచార కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. యనమల రామకృష్ణుడు, పయ్యావుల కేశవ్, గురజాల మాల్యాద్రి, వేపాడ చిరంజీవి రావు, జివి రెడ్డి, ఎన్ విజయ్ కుమార్, వీరంకి వెంకట గురుమూర్తి, అంకయ్య చౌదరి, గాజుల ఆదెన్న, తోపూరి గంగాధర్ కమిటీలో ఉన్నారు.

మహిళా రక్షణలో ప్రభుత్వాలు విఫలం

మొదటి పేజీ తరువాయి

చలన చిత్రాలు, టివి సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలని కోరారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. కాలేజీల్లో, పని ప్రదేశాల్లో వేధింపుల నిరోధక అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. మద్యం, మత్తుపదార్థాలను నియంత్రించాలని, డి ఎడిక్షన్ సెంటర్లను విస్తృత పరిచి పటిష్టంగా పనిచేయించాలని డిమాండ్ చేశారు. హిందూపురం సభకు ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షులు దిల్షాద్, విశాఖ సభకు ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ అధ్యక్షత వహించారు.

అప్రమత్తంగా ఉండండి

- సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారీ వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా వుండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. వరదలు, వర్షాలపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో శుక్రవారం సమీక్షించారు. వరదల ప్రభావం ఎక్కువగా వుండే అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 53.81 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోందని, ధవళేశ్వరం వద్ద కూడా వరద ప్రవాహం 16 లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశాలు ఉన్నట్టుగా అంచనా వేస్తున్నారని వివరించారు. వరద ప్రభావం ఉన్న ప్రాంతాల్లో సహాయం, పునరావాసం కార్యక్రమాలు అత్యంత సమర్థవంతంగా సాగాలన్నారు. . అధికారులు మానవీయ కోణంలో సహాయం అందించాలని ఆదేశించారు. అదనంగా ఖర్చు చేసి అయినా బాధితులకు అండగా ఉండాలని ఆదేశించారు..లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. వరద సహాయ శిబిరాల్లో మంచి సదుపాయాలు కల్పించాలన్నారు. ముంపునకు గురైన ఇళ్లు, అలాగే వరదనీరు ప్రవహించిన ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఉదారంగా నిత్యావసరాలను అందించాలన్నారు. 25 కేజీల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళా దుంపలు, కేజీ పామాయిల్, కేజీ కందిపప్పు ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి రెండు వేలు ఇవ్వాలన్నారు. వ్యక్తులకైతే వెయ్యి రూపాయలు ఇవ్వాలన్నారు. ఇళ్ల నుంచి సహాయ శిబిరాలకు వచ్చిన వారిని వారిని తిరిగి పంపించేటప్పుడు ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.10 వేలు సహాయం అందించాలన్నారు. కచ్చా ఇంటిని నిర్మించుకోవడానికి ఈ డబ్బు ఉపయోగపడుతుందన్నారు. ఈ నాలుగు సంవత్సరాల్లో ప్రతి ఏడాది కూడా ఇలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని ఈ ఏడాది కూడా అదేమాదిరి పనిచేయాలన్నారు. ప్రతి సచివాలయంలో కంట్రోలు రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కంట్రోల్ రూమ్స్‌ను జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకూ నిరంతరం సమీక్షిస్తుండాలని తెలిపారు. సచివాలయాల సిబ్బందిని, వలంటీర్ల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలన్నారు.

అండగా నిలవండి ఎమ్మెల్యేలకు ఆదేశం

వరద బాదితులకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేలను ఆదేశించారు . ప్రతి ఎమ్మెల్యే వరద ప్రాంతాల్లో పర్యటించాలని కోరారు. ప్రజలు ఇబ్బందుల్లో వుండే ఇలాంటి సమయాల్లోనే క్షేత్రస్థాయిలో అండగా నిలవాలని సూచించారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ప్రమాణస్వీకారం

- సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులతో పాటు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డిప్యూటి చైర్మన్ జకియా ఖానమ్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి, మంత్రులు బూడి ముత్యాలనాయుడు, తానేటి వనిత, అంబటి రాంబాబు, ఎపి కేశినేని నాని, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, గద్దె రామ్మోహన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు అభినందనలు తెలిపారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి చెందిన జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ పదోన్నతిపై ఆంధ్రప్రదేశ్‌కు చీఫ్ జస్టిస్‌గా వచ్చారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టిఎస్ ఠాకూర్ తమ్ముడే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్. జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ 1964 ఏప్రిల్ 25న జన్మించారు. 1989 అక్టోబరు 18న ఢిల్లీ, జమ్ముకశ్మీర్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 2011లో సీనియర్ న్యాయవాది హోదాను పొందారు. 2013 మార్చి 8న జమ్ముకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022 జూన్ 10న బాంబే హైకోర్టుకు బదిలీ అయి సేవలు అందించారు.

వైద్య విద్యను దూరం చేసే జిఓలను రద్దు చేయండి : కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జిఓనెంబర్ 107, 108 లను రద్దు చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప, ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జిఓలలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీట్లను వర్గీకరణ కింద విభజించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రానికి మంజూరు చేసిన మెత్తం మెడికల్ సీట్లు 750లో జాతీయ మెడికల్ కౌన్సిల్ 112 సీట్లను అన్ని రాష్ట్రాల వారికి ప్రతిభ ఆదారంగా కేటాయిస్తారని తెలిపారు. మిగిలిన 638 సీట్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఓల వలన 319 సీట్లు (50 శాతం) సాధరణ విభాగానికే కేటాయించటం దుర్మార్గామైన చర్యగా పేర్కొన్నారు. 269 సీట్లలో బి వర్గీకరణ కింద ప్రైవేటు కాలేజీల్లో 5 సంవత్సరాలకు 60 లక్షలు, సీ వర్గీకరణ (ఎన్‌ఆర్‌ఐ) కింద 5 సంవత్సరాలకు కోటి రూపాయలను ప్రభుత్వం వసూలు చేస్తోందని మండిపడ్డారు. గతంలో ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య విద్యలో ఫీజులను దండుకోవాలని ప్రయత్నించాయని కానీ కోర్టులు ముందు అవి నిలబడలేదని గుర్తుచేశారు. రాజ్యాంగంలో అధికరణ 46 ప్రకారం షెడ్యూల్డ్ కూలాల, షెడ్యూల్డ్ తెగలు, ఇతర బలహీన వర్గాల ప్రయోజనాలను కాపాడాలని తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆల్ ఇండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ గణాంకాల ప్రకారం 43 మెడికల్ కోర్సులలో గత ఏడేళ్లలో ఎస్సీల నమోదు 13.42 గా, ఎస్టీల నమోదు 4.95 శాతంగా మాత్రమే ఉందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య విధానంపై తీసుకున్న చర్య సరైనది కాదని, దీనిపై పునరాలోచన చేయాలని కోరుతున్నట్లు తెలిపారు.

వివేకా హత్య కేసులో నిందితుడి పిటిషన్ విచారణ 31కి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో బెయిలు దరఖాస్తు చేసుకోవడానికి నిందితుడు శివశంకర్‌రెడ్డి కోర్టు ఉత్తర్వుల్లో స్పష్టత కోరవచ్చని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దర్యాప్తు అధికారిని మార్చాలంటూ శివ శంకర్‌రెడ్డి భార్య తులసమ్మ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఆ పిటిషన్ విచారణ సమయంలో ఆరునెలల్లో ట్రయల్ ప్రారంభం కాకుంటే శివశంకర్‌రెడ్డి బెయిలు దరఖాస్తు చేసుకోవచ్చని జస్టిస్ ఎంఆర్‌షా, జస్టిస్ సిటి రవికుమార్‌ల ధర్మాసనం ఆదేశాలిచ్చింది. ఒకవేళ విచారణ మొదలైతే ఎప్పటి వరకూ బెయిలు పిటిషన్ దాఖలు చేసుకొనే అవకాశం లేదో తెలపాలని కోరుతూ మార్చి 29 నాటి ఉత్తర్వులపై స్పష్టత ఇవ్వాలంటూ తులసమ్మ మిస్‌లీనియస్ అప్లికేషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌ను జస్టిస్ సిటి రవికుమార్, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. సిజెఐ ఉత్తర్వులు ఉంటే ధర్మాసనం దృష్టికి తీసుకురావాలని జస్టిస్ సిటి రవికుమార్ పేర్కొన్నారు. అన్ని పిటిషన్లూ ఒకే ధర్మాసనం విచారించాలని ఏమైనా ఆదేశాలు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవని న్యాయవాది అగర్వాల్ సమాధానమిచ్చారు. "మార్చి 29 నాటి ధర్మాసనంలో సభ్యుడిని. ఆ ఉత్తర్వుల ప్రకారం ట్రయల్ ప్రారంభం కాకపోతే నిందితుడు బెయిలుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రయల్ ప్రారంభమైతే నిందితుడు బెయిలు దాఖలు చేసుకోలేరు. దీనిపై స్పష్టత కోరుతున్నారు. తప్పేముంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అవసరమైతే ఒకే ధర్మాసనం అన్ని పిటిషన్లు విచారించాలా అని ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో రిజిస్ట్రీ వద్ద వెరిఫై చేసుకుంటామన్న ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణ సోమవారం చేపడతామని స్పష్టం చేసింది.

1 నుండి ప్రాజెక్టుల సందర్శన

- ప్రభుత్వ నిర్వాకాన్ని అక్కడే బట్టబయలు చేస్తా
- జగన్ విధానాలే పోలవరానికి శాపం
- విలేకరుల సమావేశంలో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను ఆగస్టు ఒకటవ తేది నుండి సందర్శించనున్నట్లు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రబాబునాయుడు తెలిపారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్వాకాన్ని, రాష్ట్ర ప్రజలకు చేసిన ద్రోహాన్ని, అవినీతి బాగోతాన్ని ప్రాజెక్టుల వద్ద బట్టబయలు చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పేంతవరకూ వదిలిపెట్టేది లేదన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనుసరించిన విధానాలే శాపంగా మారాయన్నారు. రాష్ట్రప్రభుత్వ అసమర్థ నిర్ణయాలు, రివర్స్ పోకడల కారణంగా ప్రాజెక్టు సర్వనాశనం అయ్యిందని చెప్పారు. డయాఫ్రంవాల్ కొట్టుకుపోవడానికి జగన్ మూర్ఖపు నిర్ణయాలే కారణమని విమర్శించారు. గోదావరి నుంచి సముద్రం పాలవుతున్న 2 నుంచి 4 వేల టిఎంసిల నీటిని వాడుకుంటే రాష్ట్ర రూపురేఖలే మారిపోతాయని తెలిపారు. 2020 నాటికే పూర్తికావాల్సిన ప్రాజెక్టు ఎందుకు ఆలస్యమవుతోందని, సాంకేతికంగా జరిగిన తప్పులకు కారకులు ఎవరని ఆయన ప్రశ్నించారు. డయాఫ్రమ్ వాల్‌లో కీలకమైన కాఫర్‌డ్యామ్ డౌన్, అప్‌స్ట్రీమ్‌ల మధ్యలో కొట్టుకుపోయి ఇసుక పేరుకుందన్నారు. స్పిల్‌వే ఎడమవైపు నీటి ఉధృతిని ఎదుర్కొనడానికి నిర్మించిన గైడ్‌బండ్ కూడా కుంగిపోయి చివరకు ప్రాజక్టులో గేట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఇంతదారుణం జరిగితే సమాధానం చెప్పకుండా రంకెలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును 2021 జూన్ నాటికి పూర్తిచేసి నీళ్లిస్తామని ఒకసారి, 2022 ఖరీఫ్ నాటికి పూర్తిచేస్తామని మరోసారి, 2023 ఖరీఫ్‌కు పూర్తిచేస్తామని ఇంకోసారి జగన్ పలు సందర్భాల్లో చెప్పారని వీడియోల ద్వారా వివరించారు. తమ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టుకు రూ.11,537 కోట్లు ఖర్చు చేసి 72శాతం పూర్తిచేస్తే, వైసిపి ఇప్పటివరకు రూ.4,611 కోట్లు మాత్రమే ఖర్చు చేసి 4శాతం పనులు చేసిందని వివరించారు. ముంపు బాధితులకు పరిహారం రెట్టింపు ఇస్తామని ప్రతిపక్షనేతగా ప్రగల్భాలు పలికి, నేడు వాళ్లను ముంచేశారని మండిపడ్డారు. 2010-11 ధర అంచనా ఆధారంగా తాము పరిహారం ఇవ్వాలని చూశామన్నారు. వరదలు వస్తే నిర్వాసితుల్ని గాలికి వదిలేసి రెండు టమాటాలు, బంగాళాదుంపలతో చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. సకల వసతులతో నిర్వాసితులకు కాలనీలు నిర్మిస్తానని, నాలుగేళ్లలో ఒక్క ఇల్లు కట్టలేదన్నారు.

గోదావరి, కృష్ణా ఉధృతం

మొదటి పేజీ తరువాయి

నీటిమట్టం నమోదైంది. వెంకటాపురం గ్రామం, ఎస్‌సి కాలనీకి మధ్య రోడ్డుపైకి వరద నీరు చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వరద పెరుగుతుండడంతో అధికారులు కుక్కునూరులోని 'ఎ' బ్లాక్, రామాలయం సెంటర్, దాసరి బజార్, రజక బజార్‌కు చెందిన 200 కుటుంబాలను కివ్వాక పునరావాస కాలనీకి తరలించారు. కౌండిన్యముక్తికి చెందిన దాదాపు 50 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు. వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేశారు.

అల్లూరి జిల్లాల్లో వంద గ్రామాలకు తెగిపోయిన సంబంధాలు

గోదావరి వరద ఉధృతి కొనసాగుతుండడం, వాగులు, వంకలు పొంగి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుండడంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లో వంద గ్రామాలకు మండల కేంద్రాలతో సంబంధాలు తెగిపోయాయి. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 40 అడుగులు నమోదైంది. సోకిలేరు, చంద్రవంక, చీకటి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రామవరం, గుర్రంపేట, నూతిగూడెం, కన్నాయిగూడెం కాలనీ, వడ్డిగూడెం, ధర్మతాల గూడెం, వడ్డిగూడెం కాలనీలను వరద నీరు చుట్టుముట్టింది. వరద ముంపునకు గురైన వారికి ఎర్రగట్టు, చలంపాలెం, సీతాపురం, గన్నవరం గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే బాలరాజును నిలదీస్తున్న వేలేరుపాడు గ్రామస్తులు

కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలంకలోకి చేరిన వరద నీరు

కొమ్మూరు గ్రామస్తుల జలదీక్ష

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న చింతూరు మండలం కొమ్మూరు గ్రామ ప్రజలు శుక్రవారం నీటిలో దిగి జలదీక్ష చేపట్టారు. 41.15 కాంటూరులో తమ గ్రామాన్ని చేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సిపిఎం బృందాల పర్యటన

ఎటపాక మండలంలోని ముంపు గ్రామాల్లో సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, తదితరులు పర్యటించి బాధితులను పరామర్శించారు. వరద బాధితులకు నిత్యావసర సరుకులు ఇవ్వాలని, బోట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కూనవరం, విఆర్.పురం, చింతూరు ప్రాంతాల్లో సిపిఎం బృందాలు పర్యటించాయి.

'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

విఆర్.పురం మండలం రామవరం, గుర్రంపేట, నూతిగూడెం, కన్నాయిగూడెం కాలనీ, వడ్డిగూడెం, ధర్మతాల గూడెం, వడ్డిగూడెం కాలనీల ప్రజలు వరదల సమయంలో పడుతున్న అవస్థలపై 'ప్రజాశక్తి' కొద్ది రోజులుగా ఇచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. ఆయా గ్రామాల్లో కందిపప్పు, ఉల్లిపాయలు, ఆలుగడ్డలు, క్యాబేజీలు అందజేశారు. రేఖపల్లి పునరావాస కేంద్రంలో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

జాతీయ రహదారిపై వాహనాల రాకపోకల పునరుద్ధరణ

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామం వద్ద 65వ జాతీయ రహదారిపై వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో, గురువారం మధ్యాహ్నం నుండి విజయవాడ - హైదరాబాద్ మధ్య నిలిచిపోయిన వాహనాల రాకపోకలు మళ్లీ కొనసాగుతున్నాయి. జాతీయ రహదారిపై అక్కడక్కడా గుంటలు పడడంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు.

విశాఖలోని వడ్లపూడి రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- డిఆర్‌ఎం కార్యాలయాల ఎదుట ఆందోళన

ప్రజాశక్తి - యంత్రాంగం

రైల్వే ప్రయివేటీకరణ ఆపాలని, కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని డిఆర్‌ఎం ఆఫీసు ఎదుట కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేపట్టారు. ఆలిండియా డిమాండ్స్ డే సందర్భంగా రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. విజయవాడ రైల్వే స్టేషన్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. ఈ ధర్నాతో పాటుగా రైల్వే కాంట్రాక్ట్ కార్మిక యూనియన్ (సిఐటియు) వ్యవస్థాపక నాయకులు ఎస్.ఎం.సుభానీ నాలుగో వర్ధంతి నిర్వహించారు. విశాఖలోని రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం ఎదుట, వడ్లపూడి వద్ద ఉన్న వ్యాగన్ రిపేర్ వర్క్ షాప్ వద్ద ధర్నా చేశారు. వడ్లపూడి వద్ద జరిగిన కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.నరసింహులు మాట్లాడుతూ.. రైల్వే కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. డిఆర్‌ఎం కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సంఘం విశాఖ జిల్లా కార్యదర్శి ఒ.అప్పారావు తదితరులు మాట్లాడారు.విజయవాడ, తిరుపతిలో రైల్వేస్టేషన్ల ఎదుట ధర్నా చేపట్టారు. అనంతపురం జిల్లా గుంతకల్లులో ఆందోళన చేపట్టారు. అనంతరం డివిజనల్ రైల్వే మేనేజర్ మనీష్ అగర్వాల్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

ధర్నాలో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

మోటారు కార్మికులపై వేధింపులు తగదు

- రోడ్డు ట్యాక్స్ రద్దు చేయాలి : ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టాటా మ్యాజిక్ మోటారు రంగ కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నాయని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ అన్నారు. మోటారు రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్ టాటా మ్యాజిక్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు), ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్‌వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో టాటా మ్యాజిక్ కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. ధర్నాలో ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన రోడ్ ట్యాక్స్‌లను ఉపసంహరించుకోవాలని, జిఒ నెంబర్ 21ను రద్దు చేయాలని, మోటారు రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శివాజి మాట్లాడుతూ.. మోటారురంగ కార్మికులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా రోడ్ టాక్స్, ఇన్సూరెన్స్, వేలాది రూపాయల జరిమానా, ఈ చలానాలు, కఠినమైన శిక్షలు వంటి వాటితో వేధించడం తగదన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు తదితరులు మాట్లాడారు.

మార్గదర్శిది కార్పొరేట్ మోసం : సిఐడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శి వ్యవహారంలో అనేక అక్రమాలు గుర్తించామని సిఐడి ఎస్‌పి అమిత్ బర్దర్ తెలిపారు. అదొక కార్పొరేట్ మోసంగా వుందని అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని పబ్లిసిటి సెల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన సిఐడి ఐజి సిహెచ్ శ్రీకాంత్‌తో కలిసి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారని మార్గదర్శిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని అన్నారు. వీటిలో ఏడు క్రిమినల్ కేసులు కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ కేసుల్లో పారదర్శకంగా విచారణ చేస్తున్నామని అన్నారు. ఉషాకిరణ్ మీడియా లిమిటెడ్, ఉషోదయ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తులు అటాచ్ చేస్తూ హోమ్ శాఖ నిర్ణయం తీసుకుందని, మొత్తం రూ1,035 కోట్ల చరాస్తులు అటాచ్ చేశామని తెలిపారు. కోర్టులోనూ అటాచ్‌మెంట్ పిటీషన్ దాఖలు చేశామన్నారు. రెండు క్రిమినల్ కేసులలో 15 మందిపై చార్జిషీట్ వేశామని అన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం వెంటనే అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.బేబిరాణి, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పేరుతో అధికారులు, రాజకీయ నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. పామర్రు అంగన్‌వాడీ కేంద్రంలో రాజకీయ నాయకుల వేధింపులు తట్టుకోలేక డి.అన్నపూర్ణ ఆత్మహత్య చేసుకున్నారన్నారు. తెలంగాణ కంటే మెరుగైన వేతనాలు ఇస్తామని గతంలో చెప్పారని, ఇంతవరకు అంగన్‌వాడీలకు సరైన న్యాయం జరగలేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు.

ప్రత్యేకహోదా కోసం చలో ఢిల్లీ

మొదటి పేజీ తరువాయి

కేటాయించారే తప్ప పనుల పురోగతి లేదన్నారు. విశాఖస్టీల్ ఫ్యాక్టరీ విషయంలో కూడా గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. అదాని చేతిలోకి ఫ్యాక్టరీ వెళ్లిన అనంతరం ఒక్క గిరిజనుడికి కూడా ఉద్యోగం వచ్చే అవకాశాలు లేవన్నారు. అటవీచట్టం 2006ను యుపిఎ ప్రభుత్వం తీసుకువస్తే బిజెపి ఆ చట్టానికి సవరణలు చేసి గిరిజనులకు అన్యాయం చేసిందన్నారు. విశాఖలో కాఫీబోర్డును చిక్‌మగుళూరు కు పంపిందన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ సాధన కోసం అనేక సార్లు కేంద్రమంత్రులను కలిశామన్నారు. విశాఖజోన్ ఏ రోజు నుంచి విశాఖ నుంచి ప్రారంభిస్తున్నామనే తేదీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తేదీ ప్రకటించకుండా నిధులు విడుదల అంటే ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. పోలవరం నిర్వాసితులు, గిరిజనులు కొండలు గుట్టలు ఎక్కుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గు కూడా కలగడంలేదన్నారు. మణిపూర్ ఘటనలపై ప్రధాని సభకు రాకుండా తప్పించుకుని తిరుగుతుంటే ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్న సందర్భంలో వైసిపి, టిడిపి బిజెపికి మద్దతుగా నిలిచాయన్నారు. విభజన హామీల అమలు కోసం క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతును చేసేందుకు ఆగస్టు 16, 17 తేదీల్లో ప్రారంభించి 15 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ప్రచారయాత్రను చేయాలని నిర్ణయించామన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేషు మాట్లాడుతూ ప్రత్యేకహోదాను గొంతు నులిపింది తొలుత చంద్రబాబేనన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ సాధ్యంకాదని, దుగరాజపట్నం కూడా సాధ్యం కాదని కేంద్రమంత్రి ప్రకటించినా రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు స్పందించడం లేదన్నారు. కడప స్టీల్ ప్లాంట్‌కు ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేశారని, పునర్విభజన చట్టంలో ఉన్నప్పటికీ నేడు కేంద్రం లాభదాయకం కాదని చెప్పడమంటే ప్రజలను మోసం చేయడమేనన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ ప్రత్యేకహోదా అమలు చేయకపోతే ఓటు వేయమనే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈనెల 30న రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ప్రభాకర్‌రెడ్డి, సిపిఐ నాయకులు దోనేపూడి శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఆమ్‌ఆద్మీనాయకులు చెన్నుపాటి వజీద్, అమరావతి దళిత బహుజన నాయకులు పోతుల బాలకోటయ్య, ఎపి జర్నలిస్టు ప్రొఫెషనల్ ఫోరం నాయకులు కృష్ణాంజనేయులు, ఎఐవైఎఫ్ ఎస్‌ఎఫ్ఐ, డివైఎఫ్ఐ , ప్రజాసంఘాలు, ఆమ్ ఆద్మీ పార్టీ, పలువురు నేతలు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండ ఆపండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అరకులోయలో దిష్టిబొమ్మ దగ్ధం అనంతరం మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మణిపూర్‌లో గిరిజన మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన ఘటన అత్యంత అమానుషమైనదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మణిపూర్‌లో మతోన్మాద, కార్పొరేట్ మారణకాండను ఆపాలంటూ అరకులోయ మండలంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. 'మతోన్మాదం' దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మణిపూర్‌లో అత్యంత విలువైన ఖనిజ సంపదను కాజేసేందుకు కేంద్ర కుట్రలు పన్నుతోందని, ఆ కుట్రలను అడ్డుకుంటున్న గిరిజనులపై దాడులు చేయిస్తోందని తెలిపారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా అక్కడి ప్రభుత్వానికిగానీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికిగానీ చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొల్పడంలో విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను ఖండిస్తూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం పెడుతుంటే ప్రధాని నరేంద్ర మోడీ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఆయన మౌనం వెనుక బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ హస్తముందని అన్నారు. పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానంపై వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి స్పందిస్తూ మణిపూర్ ఘటనపై కేంద్ర హోం శాఖ చూసుకుంటుందని, కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంటుకు, ప్రధాన మంత్రికి సంబంధంలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోనూ మతం, కులం పేరిట చిచ్చుపెట్టి ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని, అల్లూరి స్ఫూర్తితో ప్రజలు మేల్కొని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో జరిగిన అమానుష ఘటనలకు నిరసనగా పలు జిల్లాల్లో ఆందోళనలు చేశారు. కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు మండలంలోని కవుతరంలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. చల్లపల్లిలో వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులోని శ్రీవాహిని ఇంజనీ రింగ్ కళాశాలలో ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. శ్రీకాకుళంలో దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యాన అంబేద్కర్ జంక్షన్ నుంచి డేఅండ్‌నైట్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యాన ఎన్‌జిఒ హోం నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఆశావర్కర్లు నిరసన తెలిపారు. కడియంలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ముస్లిములు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో న్యాయవాదులు నిరసన తెలిపారు.

పలువురు ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు జిఒఆర్‌టి నెంబరు 1484ని విడుదల చేసింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2017 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ధ్యానచంద్రను గ్రామ వార్డు సచివాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న గంధం చంద్రుడు (2010 ఐఎఎస్ అధికారి)ని ఉద్యానవన శాఖ డైరెక్టర్‌గా నియమించారు. ఇప్పటివరకు అక్కడ విధుల నిర్వహిస్తున్న ఎస్ఎస్ శ్రీధర్ (ఐఎఫ్ఎస్ 1992 బ్యాచ్)ను జిఎడికి రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న 2017 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన నిశాంతిని సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న 2018 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్‌ను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా క లెక్టర్‌గా, ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న హిమాన్షు శుక్లాను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. టెక్కలి సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న తాటిమాకుల రాహుల్ కుమార్‌రెడ్డిని నంద్యాల జెసిగా నియమించారు. నరసాపూర్ సబ్ కలెక్టర్ మల్లవరపు సూర్యతేజను కెఆర్ పురం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసరుగా ప్రభుత్వం నియమించింది.

స్వాధీనతా ప్రకటన

ఏదైతే, **అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులను జారీచేసి, దిగువ రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా సదరు నోటీసుల్లో పేర్కొన్నట్లు వర్తించు రేట్లతో దానిపై వడ్డీతోపాటు వారి సదరు పేరుకు ఎదురుగా పేర్కొనబడిన మొత్తాలను, చెల్లించు/రియలైజేషన్ తేది వరకు సంభవించు వర్తించు తదుపరి వడ్డీ, ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితోసహా పై పేర్కొన్న మొత్తాలను దిగువ రుణగ్రహీతలును చెల్లించవలసిందిగా కోరబడినది.

క్ర. సం	రుణ ఖాతా నం./రుణగ్రహీత పేరు/విక్రేత బ్యాంకు పేరు	డిమాండ్ నోటీసు తేది/ 13(2) నోటీసు మొత్తం రూ.లో	స్వాధీనతా తేది & విధానం
1.	11201109514 / & 11201113386 వరికుటి హరికృష్ణ/వరికుటి నాగలక్ష్మి	Rs. 8,49,205.23/- & 6,99,048.27/- as On 20-April- 2021	భౌతికం 25/07/2023

సెక్యూర్డ్ అసెట్ వివరణ: తనఖా ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ డో.నం.313, మూల్యాంకనం నం.677 నం.4 డో.నం.313 వద్ద ఉన్న మూల్యాంకనం నం.677 నం.4 132, డో.నం.313, మూల్యాంకనం నం.677 నం.4 132, అత్తోట గ్రామ పంచాయతి కొల్లిపర మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్, గుంటూరు-522306.

ఏదైతే, ఇందు పై పేర్కొనబడిన రుణగ్రహీతలు బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా ప్రత్యేకించి ఇందు పై పేర్కొన్న రుణగ్రహీతలకు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, పై పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్ట యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు పై వివరించిన ఆస్తులు/సెక్యూర్డ్ అసెట్స్‌ను **ఆర్సిల్** యొక్క అధీకృత అధికారి **భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు.** ప్రత్యేకించి ఇందు పై పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, పై సదరు ఆస్తులతో/సెక్యూర్డ్ అసెట్స్‌తో లావాదేవీలు జరుపరాదని మరియు **ఆర్సిల్**కు చెల్లింపులమేరకు జరుపుకోవచ్చును. రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటలో, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించారు.

ప్రదేశం: గుంటూరు
తేది: 29.07.2023

సం/- అధీకృత అధికారి
అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్

అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్.
Arcil Premier ARC
CIN: U6599MH2002PLC134884 www.arcil.co.in
నమోదిత కార్యాలయం: ది రూబీ, 10వ అంతస్తు, 29, సేనాపతి బాపట్ మార్గ్, దాదర్ (వెస్ట్), ముంబాయి-400028 టెలి: + 91 2266581300
శాఖ చిరునామా: ఫ్లాట్ నం.207, 2వ అంతస్తు, భువన టవర్స్, ఎస్.డి.రోడ్, పాట్నీ, సికింద్రాబాద్-500 003, టెలి: 040-66028010-14

జీడి రైతుల గోడు పట్టదా?

మద్దతు ధర రూ.16 వేలు ప్రకటించాలి : మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)

మద్దతు ధర కోసం జీడి రైతులు మూడు నెలలుగా పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వారి గోడు పట్టడంలేదని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పలాసలోని కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద జీడి రైతు సంఘం ఆధ్వర్యాన 24 గంటల సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలని స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుల అమలుకు ప్రభుత్వం నేటికి ముందుకు రావడంలేదన్నారు. జీడిపప్పుపై 12 శాతం జిఎస్‌టి, జీడి పిక్కలపై 5 నుంచి 2.5 శాతం ఎక్సైజ్ సుంకం తగ్గింపు వంటి విధానాలతో జీడి రైతులను నాశనం చేశారన్నారు. తక్షణమే విదేశీ జీడిపిక్కల దిగుమతులను ఆపాలని, జీడి పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు భరోసానిచ్చే జీడి కార్పొరేషన్‌నుగానీ, బోర్డునుగానీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒడిశా, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలు జీడి పంట, రైతులకు మేలు చేసే విధానాలను అనుసరిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. జీడి పిక్కల ధర పాతాళానికిపోతుంటే, పప్పు ధర ఆకాశాన్ని తాకుతోందని తెలిపారు. దీనికి ప్రభుత్వం కారణం కాదా? అని ప్రశ్నించారు. ఆర్‌బికెల ద్వారా అన్నీ కొనుగోలు చేస్తామని చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం జీడిపిక్కలను ఎందుకు కొనడం లేదని నిలదీశారు. మద్దతు ధర లేక జీడి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఎందుకు చర్చించడం లేదనిప్రశ్నించారు. 80 కేజీల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి రైతుల సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలతో చర్చించి, శాసనమండలిలో ప్రస్తావిస్తామన్నారు. తొలుత అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళర్పించారు. జీడి రైతు సంఘం పతాకాన్ని మార్పు ట్రస్టు అధ్యక్షులు మట్ట ఖగేశ్వరరావు, రైతు ఉద్యమ సీనియర్ నాయకులు కె.కృష్ణారావు ఆవిష్కరించారు. దీక్షకు పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన దీక్షలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కె.హేమారావు చౌదరి, పి.కుసుమ, కె.బాలాజీరావు, కె.సింహాచలం, ఎ.రామకృష్ణ, కె.తవిటయ్య, ఎస్.ఈశ్వరరావు, ఎస్.కుమార్, జె.గవరయ్య, కె.గురయ్య కూర్చొన్నారు.

విద్యుత్ బిల్లుల్లో సైబర్ నేరాలు

- ఎపిసిడిపిసిఎల్ సిఎండి పద్మజనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల సైబర్, ఆన్‌లైన్ మోసాలకు వినియోగదారులు గురికావొద్దని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటేడ్(ఎపిసిపిడిసిఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జె పద్మజనార్ధన రెడ్డి తెలిపారు. కొన్ని నెలలుగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 'డియర్ కన్స్యూమర్, మీ మునుపటి నెల బిల్లు అప్‌డేట్ కానందున ఈ రాత్రికి విద్యుత్ నిలిపివేయబడుతుందని, దయచేసి బిల్లు చెల్లించడానికి కింది లింక్‌పై క్లిక్ చేయండి' అని సందేశాన్ని పంపుతున్నారని తెలిపారు. వినియోగదారులకు వచ్చిన వాట్సాప్, ఇతర సందేశాల లింక్‌లపై క్లిక్ చేయొద్దని సూచించారు. సిపిడిసిఎల్‌పై విధంగా వినియోగదారులకు ఎలాంటి సందేశాన్ని ఇవ్వదని తెలిపారు. ఇలాంటి సందేశాలు వస్తే సంబంధిత విద్యుత్ అధికారులను గానీ, సైబర్ క్రైమ్ పోలీసు వారిని సంప్రదించాలని కోరారు. బిల్లులను ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎం, సిపిడిసిఎల్ యాప్, ఎపిసిపిడిసిఎల్ వెబ్‌సైట్ ద్వారా, ఇతర నమ్మకమైన పేమెంట్ గేట్‌వేల ద్వారా మాత్రమే పేమెంట్ చేయాలని సూచించారు.

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
BHARATMALA ROAD TO PROSPERITY

బహిరంగ ప్రకటన

గుణదల గ్రామం, విజయవాడ తూర్పు మండలం విజయవాడ నగర పరిధిలో NH-16 పైన విస్తరించియున్న కి.మీ. 1095.6 నుండి కి.మీ. 1098.5 వరకు ఉన్న విశాలతలో విజయవాడ - మచిలీపట్నం సెక్షన్ 4 లేనింగ్ లో భాగంగా తూర్పు వైపు వద్ద బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు నిర్మాణం కొరకు భూమి సేకరణ యొక్క నష్ట పరిహార మొత్తము చెల్లింపు చేయుట మరియు భూమి స్వాధీన పరచుట కొరకు భూమి యజమానులు / అందు ఆసక్తి కల వ్యక్తులు కొరకు ప్రకటన.

ఇందుకు సంబంధించి ఈ క్రింది వార్తా పత్రికలలో ప్రచురించబడిన అంశములు భూమి యజమానులు/ ఆసక్తికల వ్యక్తులు అందరిని గమనించవలసినదిగా కోరటమైనది.

* అవార్డు ప్రకటన
* వారిని నష్టపరిహార మొత్తం 60 దినములు లోగా పొందవలసినదిగా కోరటమైనది. మరియు
* సంబంధిత భూమిని క్రింది సంతకందారునికి స్వాధీనపరచవలసినదిగా భూమి యజమానులకు అభ్యర్ధన.

వ.నెం	ప్రచురించిన వార్తా పత్రిక పేరు	వార్తాపత్రిక తేది
1	ప్రజాశక్తి (తెలుగు)	26.05.2023
2	హాన్స్ ఇండియా (ఇంగ్లీషు)	26.05.2023

నిర్ణీత కాలం 60 దినములు 25.07.2023 న ముగిసినది.

తమ బ్యాంకు ఖాతాల వివరములు దాఖలు పరచిన సంబంధిత భూమి యజమానులకు నష్టపరిహార మొత్తం జమ చేయబడినది. మిగిలిన భూమి యజమానులకు నష్టపరిహార మొత్తం చెల్లింపులు చేయుటకు సంబంధించి, వారిని ఈ కార్యాలయంను త్వరితంగా సంప్రదించి 23.05.2023 బహిరంగ ప్రకటననుసరించి కార్యాలయం నందు ఇప్పటికీ ఉంచిన నష్టపరిహార మొత్తమును పొందవలసినదిగా కోరుచున్నాము.

తదనుగుణంగా, భూమి యజమానులు / ఆసక్తికల వ్యక్తులు సంబంధిత సేకరణ భూమిని క్రింది సంతకం దారునికి వెంటనే స్వాధీనపరచవలసినదిగా సూచించటమైనది, అట్లుచేయనిచో 1956 NH చట్టం విభాగం 3E ఉప విభాగం (2) ననుసరించి సదరు భూమి పోలీసులు సహాయంతో స్వాధీనత చేపట్టబడుతుంది.

సం/- శ్రీమతి అదితి సింగ్, ఐ.ఎ.యస్.,
కాంపిటెంట్ అథారిటీ (LA) &
సబ్ కలెక్టర్ & సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, విజయవాడ.
తేదీ : 26-07-2023.

కడప 'ఉక్కు'పై కేంద్రం అహంకార వైఖరి

- ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వివిధ పార్టీల ఆందోళన

కడప ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఆర్థికంగానూ, సాంకేతికంగానూ సాధ్యం కాదని కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో హంకారపూరిత ప్రకటన చేస్తే అడగలేని వైసిపి ఎంపిలు తక్షణం రాజీనామా చేయాలని అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అలీఖాన్, బిఎస్‌పి నాయకులు గురప్ప, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, బిసి మహాసభ నాయకులు అవ్వారు మల్లికార్జున, సంఘ సేవకులు సలావుద్దీన్, జనతాదళ్ నాయకులు ప్రతాపరెడ్డి, ఎంఆర్‌ఎఫ్ నాయకులు దస్తగిరి, సిపిఎం సిపిఐ నగర కార్యదర్శులు రామమోహన్, ఎన్.వెంకట శివ మాట్లాడారు..కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారిన కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించా లన్న లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశార న్నారు. కడప ఉక్కు పరిశ్రమ రాష్ట్ర విభజన చట్టంలో చేర్చినప్పటికీ అధికా రంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం విభజన హామీలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా విభజన హామీలపై సిఎం జగన్ మాట్లాడకపోవడం శోచనీయమని అన్నారు.

మరో విభజన వివాదం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రాన్ని విభజన వివాదాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. తాజాగా కొత్త సమస్య ఒకటి తెరపైకి వచ్చింది. 1975 రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ శాఖలన్నీ ఉమ్మడి 25 జిల్లాలకూ సేవలు అందించాలని ఉంది. ఈ ఉత్తర్వుల్లోని క్లాజ్-1లో ఈ విషయం స్పష్టంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించి అటు కార్యాలయాలు, ఇటు అనేక ప్రాజెక్టులను కూడా పేరుపేరునా ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. అయితే రాష్ట్ర విభజన జరగడంతో రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించాల్సిఉందని, అలా జరగకపోవడం తో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఒక సర్క్యులర్ జారీ చేశారు. 1975 రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ప్రస్తావించిన శాఖలు, పథకాలను సిఎస్ ప్రస్తావిస్తూ వాటి వివరాలను, తాజా పరిస్థితిని వివరించాలని అన్ని శాఖలను ఆదేశించారు. రాష్ట్రపతి ఉత్తర్వులపై అప్పట్లోనే సాధారణ పరిపాలన శాఖ కూడా రాష్ట్రంలో గెజిట్‌ను విడుదల చేసింది. దాని ప్రకారం పస్తుతం ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 33 నీటిపారుదల పథకాలు కూడా ఉన్నాయి. వాటిల్లో ప్రధానంగా వంశధార, ధవళేశ్వరం, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, నిజాంసాగర్, పోచంపాడు, కృష్ణా గోదావరి డెల్టా, సోమశిల, జూరాల, తెలుగు గంగ, విశాఖపట్నం వాటర్ సప్లై అభివృద్ధి పథకం వంటివి ఉన్నాయి. ఇదే సమయంలో ఇప్పుడు దాదాపు ఐదు రాష్ట్రాల మధ్య వివాదంగా ఉన్న పోలవరం ప్రాజెక్టును కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొనడం విశేషం.

ఇక శాఖలకు సంబంధించి ఎసిబి, పౌరసరఫరాల శాఖలోని విజిలెన్స్ విభాగం, రైల్వే పోలీస్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, అసిస్టెంట్ ఎక్సయిజ్ సూపరింటెండెంట్ కార్యాలయా లు, భారీ, మధ్యతరహ నీటిపారుదల ప్రాజెక్టుల ఇన్‌వెస్టిగేటింగ్ సర్కిల్స్, రిగ్స్ డివిజన్స్, వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ సర్కిల్స్ వంటివి ఉన్నాయి. ఇవికాక, మరో 51 విభాగాలు కూడా ఉన్నాయి. అలాగే మరికొన్ని శాఖలకు సంబంధించి పోస్టుల పైనా అప్పటి ఉత్తర్వుల్లో ప్రస్తావించడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఆయా శాఖలకు సంబంధించిన తాజా వివరాలను ఆగస్టు రెండో తేదీలోగా సమర్పించాలని ప్రధాన కార్యదర్శి కోరారు. ఈ వివరాలతోపాటు ఆయా శాఖలు, సంస్థలకు సంబంధించిన సిఫార్సులు, రిమార్కులను కూడా సమర్పించాలని స్పష్టం చేశారు. వీటన్నింటిని క్రోడీకరించిన తరువాత సవరణ ఉత్తర్వుల కోసం కేంద్రాన్ని కోరే అవకాశం ఉందని సమాచారం.

పేదల గుడిసెల తొలగింపు

- నాయకులపై కేసులు నమోదు

ప్రజాశక్తి -పెనుకొండ

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని మడకశిర రోడ్డులో మెడికల్ కళాశాల ఎదుట పేదలు వేసుకున్న గుడిసెలను పోలీసులు తొలగించారు. సొంత ఇల్లు లేని పేదలు తమకు ఇంటిస్థలాలు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులను కోరారు. ఎలాంటి స్పందనా లేకపోవటంతో 668 సర్వే నంబర్‌లో ఐదు రోజుల క్రితం భూపోరాటం చేపట్టి పేదలు గుడిసెలు వేసుకున్నారు. అహుడా (అనంతపురం, హిందూపురం డెవలప్‌మెంట్ సొసైటీ) అధికారులు, తహశీల్దార్ ఫిర్యాదు మేరకు పేదల గుడిసెలను శుక్రవారం పెనుకొండ పోలీసులు తొలగించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న, గంగాధర్, సిఐటియు నాయకులు రమేష్, రామాంజనేయులుపై గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. నాయకులు, పేదలు శుక్రవారం ఉదయం పెద్దఎత్తున తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల స్థలాల కోసం తహశీల్దార్, కమిషనర్, సబ్ కలెక్టర్, సచివాలయంలో అర్జీలు ఇచ్చామన్నారు. ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో స్థలాలు చూపిస్తామని హామీ ఇచ్చిన పాలకులు, అధికారులు ఇప్పటివరకు స్థలం చూపకపోవడంతో భూ పోరాటం చేపట్టిన స్థలం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వెంకటేష్, నిరుపేదలు పాల్గొన్నారు.

ఎఐతో మహిళలకే ప్రమాదం ఎక్కువ

వాషింగ్టన్ : ఆటోమేషన్, కృత్రిమ మేధా (ఎఐ) వల్ల పురుషుల కంటే మహిళలే ఎక్కువ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని మెకెన్సీ అండ్ కో ఓ రిపోర్ట్‌లో తెలిపింది. 2030 చివరి నాటికి అమెరికా ఆర్థిక వ్యవస్థలో కార్మికుల మార్కెట్‌ను విశ్లేషించిన కన్సల్టెంట్ సంస్థ మెకెన్సీ అండ్ కో పరిశోధన విభాగం ఓ రిపోర్ట్‌ను వెల్లడించింది. వచ్చే ఏడేళ్లలో పురుషుల కంటే స్త్రీలు కొత్త వృత్తిలోకి వెళ్లాల్సిన అవసరం 1.5 రెట్లు ఎక్కువగా ఉందని పేర్కొంది. ఆటోమేషన్ ద్వారా ఎక్కువగా ఆఫీస్ సపోర్ట్ సహా కస్టమర్ సర్వీస్ రంగాల్లోని ఎక్కువగా ప్రమాదాన్ని ఎదుర్కోనున్నారని నివేదిక పేర్కొంది. ఆహారం, ఉత్పత్తి కార్మికులకు డిమాండ్ తగ్గిపోవడంతో నల్లజాతీయులు, హిస్పానిక్‌లు కూడా ప్రతికూలతలను చవిచూడనున్నారు. "2030 నాటికి యుఎస్‌లో కనీసం 1.2 కోట్ల మంది కార్మికులు వృత్తులను మార్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఆటోమేషన్, ఎఐతో తక్కువ వేతన కార్మికులు అత్యధికంగా ప్రభావితం కానున్నారు. వారు అత్యధిక వేతన స్థానాల్లో ఉన్నవారి కంటే 14 రెట్లు ఎక్కువగా వృత్తులను మార్చుకోవాల్సి ఉంటుంది. చాలా మందికి అదనపు నైపుణ్యాలు అవసరం." అని మెకెన్సీ అండ్ కో ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ క్వెలిన్ ఎల్లింగ్‌రూడ్ పేర్కొన్నారు. "లాయర్లు, ఉపాధ్యాయుల నుండి ఆర్థిక సలహాదారులు, ఆర్కిటెక్ట్‌లు ఇతర వైట్ కాలర్ కార్మికుల వరకు అందరూ ఎఐ ప్రమాదాన్ని చవి చూడనున్నారు. ఇది పెద్ద సంఖ్యలో ఉపాధిని నాశనం చేయనుంది. కృత్రిమ మేధా దాదాపు ప్రతి ఉద్యోగాన్ని మార్చబోతోంది." అని ఆ ఇన్స్టిట్యూట్ భాగస్వామి మైఖేల్ చుయ్ అన్నారు. చమురు, గ్యాస్ ఉత్పత్తి, ఆటోమోటివ్ తయారీలో పనిచేసే కార్మికులు గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను అంతం చేసే ప్రక్రియలో భాగంగా 35 లక్షల మంది ఉద్యోగాలు పోవచ్చని ఆ రిపోర్ట్ పేర్కొంది. ఎఐ దుష్ప్రభావాలు అంతిమంగా అన్ని దేశాలపై పడనున్నాయని నిపుణులు హెచ్చరిస్తునే ఉన్న విషయం తెలిసిందే.

విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్ (ఏలూరు జిల్లా)

విద్యుత్ ట్రూ అప్, సర్దుబాటు, అదనపు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ ఏలూరు నగర అభివృద్ధి కమిటీ, అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాద్దేశించి సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని, ప్రతిఏటా రూ.రెండు వేల కోట్ల నుండి రూ.2,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్తు సంస్కరణల చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయడం వల్ల విద్యుత్ ఛార్జీలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందుకు అయ్యే ఖర్చును వినియోగదారుల నుండే వసూలు చేయడానికి రంగం సిద్ధం చేశారన్నారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్తు శాఖ జిల్లా అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర అభివృద్ధి కమిటీ నాయకులు అడ్వకేట్ కట్ట సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ దండుబోయిన చంద్రశేఖర్, సిపిఎం నాయకులు జి.కోటేశ్వరరావు, జి.ఏసుబాబు, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు బి.జగన్నాధరావు, వి.సాయిబాబు, సిపిఐ పట్టణ కౌన్సిల్ సభ్యులు తెర్ల శ్రీను, కొండేటి విక్రమ్ పాల్గొన్నారు.

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
BHARATMALA ROAD TO PROSPERITY

బహిరంగ ప్రకటన

విజయవాడ టౌన్, విజయవాడ తూర్పు మండలం విజయవాడ నగర పరిధిలో NH-16 పైన విస్తరించియున్న కి.మీ. 1095.6 నుండి కి.మీ. 1098.5 వరకు ఉన్న విశాలతలో విజయవాడ - మచిలీపట్నం సెక్షన్ 4 లేనింగ్ లో భాగంగా తూర్పు వైపు వద్ద బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు నిర్మాణం కొరకు భూమి సేకరణ యొక్క నష్ట పరిహార మొత్తము చెల్లింపు చేయుట మరియు భూమి స్వాధీన పరచుట కొరకు భూమి యజమానులు / అందు ఆసక్తి కల వ్యక్తులు కొరకు ప్రకటన.

ఇందుకు సంబంధించి ఈ క్రింది వార్తా పత్రికలలో ప్రచురించబడిన అంశములు భూమి యజమానులు/ ఆసక్తికల వ్యక్తులు అందరిని గమనించవలసినదిగా కోరటమైనది.

* అవార్డు ప్రకటన
* వారిని నష్టపరిహార మొత్తం 60 దినములు లోగా పొందవలసినదిగా కోరటమైనది. మరియు
* సంబంధిత భూమిని క్రింది సంతకందారునికి స్వాధీనపరచవలసినదిగా భూమి యజమానులకు అభ్యర్ధన.

వ.నెం	ప్రచురించిన వార్తా పత్రిక పేరు	వార్తాపత్రిక తేది
1	ప్రజాశక్తి (తెలుగు)	26.05.2023
2	హాన్స్ ఇండియా (ఇంగ్లీషు)	26.05.2023

నిర్ణీత కాలం 60 దినములు 25.07.2023 న ముగిసినది.

తమ బ్యాంకు ఖాతాల వివరములు దాఖలు పరచిన సంబంధిత భూమి యజమానులకు నష్టపరిహార మొత్తం జమ చేయబడినది. మిగిలిన భూమి యజమానులకు నష్టపరిహార మొత్తం చెల్లింపులు చేయుటకు సంబంధించి, వారిని ఈ కార్యాలయంను త్వరితంగా సంప్రదించి 23.05.2023 బహిరంగ ప్రకటననుసరించి కార్యాలయం నందు ఇప్పటికీ ఉంచిన నష్టపరిహార మొత్తమును పొందవలసినదిగా కోరుచున్నాము.

తదనుగుణంగా, భూమి యజమానులు / ఆసక్తికల వ్యక్తులు సంబంధిత సేకరణ భూమిని క్రింది సంతకం దారునికి వెంటనే స్వాధీనపరచవలసినదిగా సూచించటమైనది, అట్లుచేయనిచో 1956 NH చట్టం విభాగం 3E ఉప విభాగం (2) ననుసరించి సదరు భూమి పోలీసులు సహాయంతో స్వాధీనత చేపట్టబడుతుంది.

సం/- శ్రీమతి అదితి సింగ్, ఐ.ఎ.యస్.,
కాంపిటెంట్ అథారిటీ (LA) &
సబ్ కలెక్టర్ & సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, విజయవాడ.
తేదీ : 26-07-2023.

శ్రీ చక్ర సిమెంట్ లిమిటెడ్
CIN: L40300AP1981PLC002952

రిజిస్టర్డు ఆఫీసు: డోర్ నం. 27/4/1, కన్నవారి తోట, గుంటూరు, ఏ.పి.-522 104, ఫోన్: 040-66614633, ఫ్యాక్స్: 040-23404657.
వెబ్‌సైట్ : www.srichakracement.com | ఇ-మెయిల్: srichakracement@gmail.com

వార్షిక సర్వసభ్య సమావేశం, ఇ-ఓటింగ్ & పుస్తక ముగింపు ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, తేది: 26 మే, 2023 నాటి ఏజియం ప్రకటనలో ఇచ్చినట్లుగా వ్యాపారంను సమీక్షించుటకగాను ఈ విపత్తు పరిస్థితుల దృష్ట్యా మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఎంసిఏ) మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (SEBI)చేత జారీచేయబడిన మార్గదర్శకాల ప్రకారం విడియో కాన్ఫరేన్సింగు (విసి)/ ఇతర ఆడియో-విజువలు మాధ్యమాలు (ఓఎవిఎం) ద్వారా, **శ్రీ చక్ర సిమెంటు లిమిటెడు యొక్క 41వ వార్సిక సర్వసభ్య సమావేశం 23 ఆగష్టు, 2023న మ॥ 12.00గం.లకు** నిర్వహించబడుతుంది.

పై సర్క్యులర్సు అనుసరించి, ఏజియం సమాచారపు నోటీసు తోసహా వార్సిక రిపోర్టు యొక్క కాపీని, వార్సిక రిపోర్టు యొక్క భౌతిక కాపీలు పంపుటలో గల ఇబ్బందుల దృష్ట్యా కంపెనీ/ డిపాజిటరీసుతో ఎవరి ఇమెయిలు ఐడిలైతే, రిజిస్టరైనవో అట్టి వాటాదారులందరికీ పంపబడినవి. అవి కంపెనీ యొక్క వెబుసైటు **http://srichakracement.com/.** వద్ద కూడా అందుబాటులో ఉంటాయి.

ఎవరి ఇమెయిలు ఐడిలైతే రిజిస్టరు కాలేదో, అట్టి సభ్యులు దిగువ వివరాలు చేరుస్తూ కంపెనీకి వద్ద లేదా ఆరుటిఏకు వద్ద **investor.relations@vccipl.com**కాని వ్రాతపూర్వకంగా రిజిస్ట్రారు& ట్రాన్సుఫరు ఏజెంటు అనగా., **srichakracement@gmail.com**వారితో లేదా వారి సదరు డిపాజిటరీసు ద్వారా: ఆర్టీఏ/డిపాజిటరీతో పేరును రిజిస్టర్డుచేయుట, చిరునామా, ఇమెయిలు, పాను కాపి, డిపిఐడి/ క్లైయింటు ఐడి/ఫోలియో నంబరు, వాటాల సంఖ్యతో వారి ఇమెయిలు రిజిస్టరుచేసుకొవలసిందిగా కొరబడుచున్నది.

సెబీ (లిస్టింగు ఆబ్లిగేషన్సు& డిస్క్లోజరు రిక్వైరుమెంట్సు) రెగ్యులేషన్సు, 2015 యొక్క రెగ్యులేషను 44 మరియు సవరించినట్లుగా కంపెనీసు (మేనేజిమెంటు& అడ్మినిస్ట్రేటివు) రూల్సు, 2014 యొక్క రూలు 20తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షను 108, పై సదరు సర్క్యులరు అనుసరించి.

- 41వ ఏజియం విడియో కాన్ఫరెన్సింగు (విసి)/ ఇతర ఆడియో-విజువలు మాధ్యమాలు (ఓఎవిఎం) ద్వారా నిర్వహించబడుతుంది.
- ఏజియం వద్ద సమీక్షించు ప్రతిపాదనకు తీర్మాణాల కొరకు వారి ఓట్లు వేయుటకు వీలుగా సిడిఎస్ఎల్ ద్వారా ఓటింగ్ సదుపాయాలును కంపెనీ వాటాదారులకు కల్పిస్తుంది. (**www.evotingindia.com**)
- సిడిఎస్ఎల్ ద్వారా విడియో కాన్ఫెరెన్సింగ్ (విసి)/ ఇతర ఆడియో-విజువల్ మాధ్యమాలు (ఓఎవిఎం) ద్వారా ఏజియంకు హాజరగుటకు సదుపాయాలను కంపెనీ వాటాదారులకు కల్పిస్తుంది. (**www.evotingindia.com**)

పుస్తక ముగింపు: ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, కంపెనీస్ (మేనేజ్‌మెంట్& అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 యొక్క రూల్ 10తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 91ను అనుసరించి, కంపెనీ యొక్క సభ్యుల రిజిస్టర్ మరియు వాటా బదిలీ పుస్తకాలు **17 ఆగస్టు, 2023 నుండి 23 ఆగస్టు, 2023** వరకు (రెండు రోజులతో కలిపి) ముగిసియుంటాయి.

ఇందుమూలంగా సభ్యులందరికీ తెలియజేయునది:

1. రిమోట్ ఇ-ఓటింగ్ **20 ఆగస్టు, 2023 (ఉ॥ 09:00గం.లు)**కు ప్రారంభమై మరియు **22 ఆగస్టు, 2023 (సా॥ 5:00గం.లు)**కు ముగియును.
2. ఓటుకు అర్హత నిర్ధారించుటకు కటాఫ్ తేది **16 ఆగస్టు, 2023.**
3. సమావేశానికి హాజరవుచున్న సభ్యులు, ఎవరైతే రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓటు వేయలేదో, అట్టి వారు ఏజియం వద్ద వారి హక్కులను వినియోగించుకోవచ్చును.
4. రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓటువేసిన సభ్యులు, ఏజియంకు హాజరవవచ్చును కాని ఏజియం వద్ద వారు తిరిగి ఓటువేయుటను అనుమతించబడరు.
5. కటాఫ్ తేది అనగా., **16 ఆగస్టు, 2023**నాటికి సభ్యుల రిజిస్టర్‌లో లేదా డిపాజిటరీస్‌తో నిర్వహించబడుచున్న బెనెఫిషల్ ఓనర్స్ రిజిస్టరులో ఎవరి పేరైతే రికార్డుచేయబడినదో అట్టి వ్యక్తులు మాత్రమే ఏజియం వద్ద ఓటింగ్ సదుపాయాలు పొందుటకు వీలు ఉంటుంది.
6. ఇ-ఓటింగ్‌కు సంబంధించిన ఏవేని సందేహాలు/ సమస్యల విషయంలో, సభ్యులు సంప్రదించండి: **మెసర్స్ వెంచర్ క్యాపిటల్ & కార్పొరేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, (ఆర్‌టిఏ), "ఆరం", 4వ& 5వ అంతస్తులు, ప్లాట్ నం.57, జయభేరి ఎంక్లేవ్ ఫేజ్-2, గచ్చిబౌలి, హైదరాబాద్- 500032. టెలి: 040-23818472/ 23818476/2386, ఫ్యాక్స్: 040-23868024, ఇమెయిల్:. investor.relations@vccipl.com లేదా helpdesk.evoting @cdslindia.com లేదా srichakracement@gmail.com.**
7. సెబీ, సర్క్యులర్ నం. సెబి/హెచ్ఓ/ఎంఐఆర్ఎస్‌డి/ఎంఐఆర్ఎస్‌డి-పిఓడి-1/పి/సిఐఆర్/2023/37 తేది: మార్చి 16, 2023 ఆధారంగా, పాన్, పిన్‌కోడ్ చిరునామా, ఇమెయిల్ చిరునామా, మొబైల్ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, స్పెసిమెన్ సిగ్నేచర్ & భౌతిక ఆస్తుల నిర్వహణ ద్వారా నామినేషన్‌తో పొందుపరుచుట తప్పనిసరి. ఫోలియోస్ ఎవరైతే ఒకరు చూపిన పత్రాలు/ వివరాలు **అక్టోబర్ 01, 2023**న లేదా తరువాత అందుబాటులో ఉండవు, కంపెనీ యొక్క రిజిస్ట్రార్& ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ ద్వారా నిలిపివేయబడును. వార్షిక రిపోర్టు ఫారం ఐఎస్ఆర్-1 ఫారాలలో కోరిన కావలసిన డిస్‌క్లోజర్స్.

బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆదేశం ద్వారా
శ్రీ చక్ర సిమెంట్ లిమిటెడ్ తరపున

తేది: 29.07.2023
ప్రదేశం: హైదరాబాద్

సం/- విజయ్ కుమార్ కపిలవాయి
మేనేజింగ్ డైరెక్టర్, డిఐఎన్: 00769568

సంపాదకీయం

అడవిపై గొడ్డలి వేటు

ఆదివాసీల జీవితాలతో ఆది నుంచి చెలగాటమాడుతూ వస్తోన్న కేంద్ర బిజెపి ప్రభుత్వం అడవితల్లిపై గొడ్డలి వేటు లాంటి సవరణలతో ఇప్పుడు అటవీ సంరక్షణ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు వ్యూహం పన్నడం దారుణం. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం మణిపూర్‌లో గిరిజన తెగల మధ్య విద్వేషాగ్ని రాజేసి.. అక్కడ అంతులేని అరాచకాలు కొనసాగుతుంటే మౌనం దాల్చిన మోడీ సర్కార్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాసం ప్రకటించిన సమయంలోనే లోక్‌సభలో అటవీ సంరక్షణ (సవరణ) చట్టం బిల్లును ఆమోదింపజేసుకోవడం బిజెపి బరితెగింపునకు మరో ఉదాహరణ. ముసాయిదా బిల్లులో ప్రతిపాదించిన సవరణలపై గిరిజనులు, పర్యావరణవేత్తలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినా మోడీ సర్కార్ ఖాతరు చేయలేదు. వేలాది మంది తమ అభ్యంతరాలను, విజ్ఞాపనలను పంపినా.. బిజెపి ఎంపి రాజేంద్ర అగర్వాల్ నేతృత్వంలోని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వాటిని బుట్టదాఖలు చేసింది. జెపిసి తీరును నిరసిస్తూ కమిటీలోని ప్రతిపక్ష సభ్యులందరూ ముక్తకంఠంతో బహిరంగంగానే అసమ్మతి ప్రకటించాల్సి వచ్చిందంటే జెపిసి ఎవరి కనుసన్నల్లో పనిచేసిందో అర్థం చేసుకోవచ్చు.

కేంద్రం ప్రతిపాదించిన సవరణలన్నీ కూడా అటవీ సంరక్షణ (కన్జర్వేషన్) చట్టాన్ని అటవీ కార్పొరేటీకరణ చట్టంగా మార్చే కుట్రపూరిత వ్యూహాలను ప్రస్ఫుటం చేస్తున్నాయి. కార్పొరేట్, ప్రయివేటు కంపెనీలు అడవితల్లిని తమ కబంధ హస్తాల్లో బంధించేందుకు వీల్లేకుండా అడ్డుపడుతున్న నిబంధనలను నీరుగార్చేలా సవరణలు తీసుకొచ్చింది.

అటవీ భూములను అటవీయేతర ప్రయోజనాల కోసం వినియోగించడానికి బదలాయింపునకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న '100 హెక్టార్లు లేదా అంతకు మించి' అని ఉన్న నిబంధనను సవరించి '1000 హెక్టార్లు పైగా' అని మార్చారు. అంటే ఇక నుంచి వెయ్యి హెక్టార్ల లోపు అటవీ భూమిని వేరే వాటికి వినియోగించడానికి ఎటువంటి అనుమతులూ అక్కర్లేదు. ఇంత పెద్ద మొత్తంలో భూమిని అటవీయేతర ప్రయోజనాలకు బదిలీ చేస్తే జీవావరణం దెబ్బతింటుందని 2019లో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖే అభ్యంతరాలు, ఆందోళన తెలిపింది. అలాగే అటవీ భూసేకరణలో గ్రామసభ సమ్మతి తీసుకోవడం అత్యంత కీలకమైనది. కానీ ప్రస్తుత సరవణలతో గ్రామసభ హక్కులకు మోడీ సర్కార్ సమాధి కట్టేసింది. అటవీ ప్రాంతంలో చేపట్టే ఏదైనా ప్రాజెక్టుకు అనుమతి కావాలన్నా, తుది ఆమోదం పొందాలన్నా..గ్రామసభ నుంచి ముందస్తు సమ్మతి తీసుకోవడం తప్పనిసరి అని 2009 ఆగస్టు 3న కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఒక ప్రత్యేక సర్క్యులర్ కూడా జారీ చేసింది. అయితే ఈ సర్క్యులర్‌ను 2017లో ఇదే మోడీ సర్కార్ వెనక్కి తీసుకున్నా.. గ్రామసభ ఆమోదం పొందాలనే నిబంధన మాత్రం అలానే ఉంది. దానిని ఇప్పుడు నీరుగార్చేసింది. అలాగే అటవీ భూమి బదలాయింపునకు అనుమతులు ఇవ్వడానికి ముందుగానే ప్రతిపాదిత ప్రాంతంలోని గిరిజనులందరికీ .. షెడ్యూల్డు తెగలు, సంప్రదాయ అటవీ నివాసుల చట్టం 2006 ప్రకారం దక్కాల్సిన ప్రయోజనాలన్నిటినీ సంబంధిత కలెక్టర్లు చేకూర్చాలి. నూతన సవరణల్లో ఈ నిబంధనలన్నిటినీ తుంగలో తొక్కి అడవి తల్లికి, అడవి బిడ్డలకి, గ్రామసభకు ఉన్న హక్కులను గంగలో కలిపేశారు.

'వన (సంరక్షణ్ ఏవం సంవర్ధన్) అధినీయం-1980గా పేరు మారుస్తున్న ప్రభుత్వం అందుకు పూర్తి విరుద్ధంగా అటవీ విధ్వంసానికి దారితీసే సవరణలతో నయవంచనకు పాల్పడుతోంది. కర్బన ఉద్గారాల తగ్గింపుకోసం, అటవీ విస్తరణ కోసం ప్రస్తుత నిబంధనలు అడ్డుగా ఉన్నాయట! దేశ భద్రత కోసం సరిహద్దులో సైనికులకు మౌలిక సదుపాయాల కల్పించేందుకు అటవీ చట్టం అడ్డు వస్తోందట. పర్యావరణ హిత పర్యాటక ప్రాజెక్టులకు నిబంధనలు అడ్డేనట! ఈ అడ్డులన్నింటినీ తొలగించేసి కొత్త చట్టాన్ని తీసుకురావడం అంటే అడవి బిడ్డలకు ఉన్న రక్షణ కవచాలను తొలగించడమే. 10 కోట్ల మంది అమాయక గిరిజనులను ఇప్పటికే టైగర్ జోన్ల పేరిట, రిజర్వు ఫారెస్టుల పేరిట, మైనింగ్ లీజులు, సౌర విద్యుత్ జోన్ల పేరిట అడవి నుంచి తరిమేస్తున్నారు. మోడీ సర్కార్ సాగిస్తున్న ఈ దురాగతాలను తిప్పికొట్టి అడవిని, అడవి బిడ్డలను రక్షించుకునేందుకు సమస్త ప్రజానీకం ముందుకు కదలాలి.

మహనీయుని మాట



ప్రపంచం మారాలని
మనం కోరుకోవడం కాదు.
మార్పు మనతో మొదలైతే...
ప్రపంచం అదే మారుతుంది.

- లియో టాల్‌స్టాయ్,
ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత.

విశ్లేషణ

మూలధన వ్యయం - ప్రాధాన్యత

దేశంలో వివిధ రాష్ట్రాల బడ్జెట్ పెట్టుబడుల వ్యయాలపై అధ్యయనం చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా ఒక రిపోర్టును విడుదల చేసింది. మొత్తం 24 రాష్ట్రాల బడ్జెట్ పెట్టుబడుల వ్యయాలను పరిశీలించగా అందులో కర్ణాటక ప్రథమ స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ అట్టడుగున ఉంది. అంటే 23వ స్థానంలో ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల వ్యయంగా రూ.30680 కోట్లు కేటాయించి ఇందులో కేవలం రూ.6189 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.

గతంతో పోలిస్తే బడ్జెట్ పెట్టుబడుల వ్యయం రాష్ట్రంలో తగ్గుతూ వస్తున్నది. బడ్జెట్‌లో కేటాయింపులే చాలా తక్కువ. కేటాయించినవి కూడా పూర్తిగా ఖర్చు చేయకుండా భారీ కోతలు విధిస్తున్నారు. 2018-19 రాష్ట్ర బడ్జెట్‌లో పెట్టుబడుల వ్యయం కింద రూ.19,856 కోట్లు కేటాయించి 72.72 శాతం ఖర్చు చేశారు. 2019-20లో రూ.12242 కోట్లు కేటాయించి 37.90 శాతం, 2019-20లో రూ.18974 కోట్లు కేటాయించి 63 శాతం, 2021-22లో రూ.47583 కోట్లు కేటాయించి 52 శాతం, 2022-23లో రూ.3080 కోట్లు కేటాయించి 23 శాతం మాత్రమే ఖర్చు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో మొత్తం రూ.2.79 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో మూలధన వ్యయ అంచనాగా రూ. 31061 కోట్లు కేటాయించారు. అంటే మొత్తం బడ్జెట్‌లో ఈ కేటాయింపులు కేవలం 11.12 శాతం మాత్రమే. ఇందులో సగం కూడా ఖర్చు చేస్తారనే గ్యారంటీ లేదు.

డా|| బి.గంగారావు

అభివృద్ధిలో ప్రభుత్వ పెట్టుబడులు చాలా కీలక పాత్ర పోషిస్తాయి. నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్య, సామాజిక మౌళిక సదుపాయాలు, రహదార్లు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రత్యేక ప్యాకేజీలు తదితర వాటిపై ప్రభుత్వం తన బడ్జెట్ ద్వారా చేసే వ్యయాన్ని మూలధన వ్యయం అంటారు. ఈ వ్యయం వల్ల ప్రభుత్వానికే కాక ప్రజలకు ఆదాయ వృద్ధి జరుగుతుంది. ప్రజల వినిమయ శక్తి పెరిగి మార్కెట్‌లో సరుకులకు డిమాండ్ పెరిగి పారిశ్రామికీకరణ, సేవారంగం వృద్ధి అవుతుంది. అలాగే పెట్టుబడుల వ్యయ కల్పన వల్ల పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వివిధ రూపాల్లో పెరుగుతాయి. ఉత్పత్తి, ఉత్పాదక శక్తి పెరుగుదలతోపాటు ప్రాంతీయ అసమానతలు కూడా తగ్గుముఖం పడతాయి. ఇంత ప్రాధాన్యత గలిగిన ఈ వ్యయాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడంలేదు. ప్రస్తుతం ఈ పద్దు కింద ఖర్చుపెడుతున్న అరకొర నిధులు కూడా ప్రాధాన్యతల ప్రకారం ఖర్చు చేయడంలేదు.

> **ఈ వ్యయం వల్ల ప్రభుత్వానికే కాక ప్రజలకు ఆదాయ వృద్ధి జరుగుతుంది. ప్రజల వినిమయ శక్తి పెరిగి మార్కెట్‌లో సరుకులకు డిమాండ్ పెరిగి పారిశ్రామికీకరణ, సేవారంగం వృద్ధి అవుతుంది. అలాగే పెట్టుబడుల వ్యయ కల్పన వల్ల పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వివిధ రూపాల్లో పెరుగుతాయి. ఉత్పత్తి, ఉత్పాదక శక్తి పెరుగుదలతోపాటు ప్రాంతీయ అసమానతలు కూడా తగ్గుముఖం పడతాయి. ఇంత ప్రాధాన్యత గలిగిన ఈ వ్యయాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడంలేదు. ప్రస్తుతం ఈ పద్దు కింద ఖర్చుపెడుతున్న అరకొర నిధులు కూడా ప్రాధాన్యతల ప్రకారం ఖర్చు చేయడంలేదు.**



రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రాష్ట్రం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతున్నదని ఊదరగొడుతున్నది. సంక్షేమ రాజ్యంగా నవరత్నాలను పదే పదే ముందుకు తెస్తున్నది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలను కూడా రాష్ట్రాభివృద్ధికి చిహ్నంగా చూపిస్తున్నది. రెండోవైపు ఏడాదికేడాది భారీగా అప్పులు తీస్తుకొన్తూ భారీ బడ్జెట్‌లను ప్రతిపాదిస్తున్నారు. బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయం మాత్రం తిరోగమన దిశలో కొనసాగుతున్నది. ప్రజల ఆదాయాలు, జీవనోపాధులు పెరగకపోగా అంతరాలు పెరుగుతున్నాయి. ప్రాంతాల మధ్య అసమానతలు తగ్గడంలేదు. చదువుకున్న యువతకు గౌరవప్రదమైన వేతనాలతో కూడిన ఉపాధి దొరకడంలేదు. ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారు.

అభివృద్ధి అంటే తాత్కాలిక ఉపశమనం కలిగించే నవరత్నాలు చుట్టూ ప్రభుత్వం తిప్పుతున్నది. ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను విస్మరించి పాలన సాగిస్తున్నది. అభివృద్ధి-సంక్షేమం మధ్య సమతుల్యతను దెబ్బతీస్తున్నది.

దేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా ఆంధ్ర రాష్ట్రానికి 975 కిలో మీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉంది. ఈ నాలుగేళ్ళలో తీరప్రాంత అభివృద్ధికి, ఈప్రాంతంలో ఉండే మత్స్యకారుల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. మాటలకే పరిమితమయ్యింది. 3 వేల కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్‌ల్యాండిగ్, జెట్టీలు నిర్మిస్తామని ప్రకటించినా ఏ ఒక్కటీ పూర్తిచేయలేదు. ప్రభుత్వ పెట్టుబడుల ద్వారా సముద్ర తీర అభివృద్ధి బహుముఖ చర్యలు ప్రణాళికా బద్ధంగా చేపట్టినట్లయితే ఈ నాలుగేళ్ళలో మత్స్యకారులకు అనేక ప్రయోజనాలు కలిగేవి. జీవనోపాధి, ఆదాయాలు పెరిగేవి. ఈ తరహా అభివృద్ధి కన్నా మొత్తం తీర ప్రాంతాన్ని బడా పెట్టుబడిదార్లకు ధారాదత్తం చేసే విధానాలను ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో విశాఖలో నిర్మించిన గంగవరం పోర్టును కూడా అదానీ పరం చేసింది. అందులో ప్రభుత్వానికి ఉన్న వాటాను కూడా మోడీ ప్రభుత్వానికి లొంగిపోయి కారు చౌకగా అదానీకి అమ్మేసింది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ క్రిష్ణపట్నం పోర్టుని కూడా అదానీ పరం చేసింది. ఇప్పుడు అదానీ చేతుల్లో వున్న గంగవరం, క్రిష్ణపట్నం పోర్టులు ఆధునిక జైళ్ళుగా నడుస్తున్నాయి.

ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో మూలపేట, కృష్ణా జిల్లాలో బందరు పోర్టులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే నెల్లూరు జిల్లాలో రామయపట్నంలో కూడా పోర్టును నిర్మిస్తున్నట్లు గతంలో ప్రకటన చేశారు. ఈ మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం పూర్తి అయిన తరువాత వీటి కార్యకలాపాలు, నిర్వహణను పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు ఇస్తామని ప్రకటన చేసారు. ప్రభుత్వం కేవలం ఒక ఫెసిలిటేటర్‌గా మాత్రమే ఉంటుందని, ల్యాండ్‌లార్డ్ పోర్టులుగా ఉంటాయని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ తరహా పోర్టుల వల్ల ప్రజలకు, ఆయా ప్రాంతాలకు ఏమాత్రం అభివృద్ధి జరగకపోగా పెద్ద ఎత్తున శ్రమ దోపిడీ జరుగుతుంది. వాస్తవంగా ఈ మూడు పోర్టులను ప్రభుత్వమే రాష్ట్ర బడ్జెట్ నుండి, రుణాల ద్వారా నిధులు సమీకరించి నిర్మించి ప్రభుత్వమే నడిపితే బ్రహ్మాండమైన అభివృద్ధి జరుగుతుంది.

దీర్ఘకాలంగా రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్య, పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయకపోవడం. ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రతోపాటు ఇతర జిల్లాల్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయటానికి బడ్జెట్ నుండి నిధులు కేటాయించడంలేదు. ఒకవేళ కేటాయించినా వాటిని ఖర్చు చేయకుండా ఇతర కార్యకలాపాలకు దారి మళ్ళిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులు పూర్తి చేయడం ఒక కలగానే మిగిలిపోతున్నది. పోలవరం ప్రాజెక్టు కూడా ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని దుస్థితి. ఫలితంగా రాష్ట్రంలో లక్షలాది ఎకరాలు నీళ్ళు సదుపాయాలు లేక వ్యవసాయం దెబ్బ తింటున్నది. రైతాంగం సంక్షోభం నుండి బయట పడలేకపోతున్నారు.

రాష్ట్రాభివృద్ధిలో విద్యుత్ రంగం అత్యంత కీలకమైనది. ఈ రంగంలో ప్రభుత్వ పెట్టుబడుల కల్పన పూర్తిగా స్తంభించి పోయింది. అనాదిగా పెండింగ్‌లోను, నిర్మాణంలో ఉన్న విద్యుత్ ప్రాజెక్టులు పూర్తి చేయటానికి బడ్జెట్ నుండి నిధులు కేటాయించడటం లేదు. ఇప్పుడు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విద్యుత్ సంస్థలను కేంద్ర బిజెపి సర్కార్ విద్యుత్ సంస్కరణలకు తలొగ్గి కార్పొరేట్ శక్తుల పరం చేయటానికి పూనుకుంది. కృష్ణపట్నం దగ్గరున్న దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయపూనుకున్నది. కొత్తగా ప్రభుత్వ పెట్టుబడులతో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం చేయకూడదనే విధానం చేపట్టింది. ఇటీవల గ్రీన్ ఎనర్జీ పేర రాయలసీమ, ఉత్తరాంధ్రలో వేలాది ఎకరాలు అదానీకి కట్టబెట్టారు. ఈ చర్యలు భవిష్యత్‌లో రాష్ట్రాభివృద్ధిపైన, ప్రజలపైన తీవ్ర ప్రభావం చూపుతాయి.

రాష్ట్రంలో వ్యవసాయాధారిత పరిశ్రమల్లో పంచదార పరిశ్రమ చాలా ముఖ్యమైనది. సహకార రంగంలో అనేక పరిశ్రమలు అనేక దశాబ్దాల క్రితమే స్థాపించబడ్డాయి. ఈ పరిశ్రమలను బలపర్చటానికి, విస్తరింపజేయటానికి ప్రభుత్వం బడ్జెట్ నుండి పెట్టుబడి వ్యయ కేటాయింపులు చాలా కాలం నుండి నిలిపేసింది. నష్టాల పేర వీటిని మూసివేసే చర్యలకు, ఈ సంస్థల కింది ఉన్న భూములను కూడా రియల్ ఎస్టేట్ సంస్థలకు అమ్మే చర్యలకు ప్రభుత్వం తెరలేపింది. ఈ విధానం వల్ల రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది చెరకు రైతులు అనేక విధాలుగా నష్టపోయారు.

రాష్ట్రంలో మరో ముఖ్యమైన వ్యవసాయ అనుబంధమైనది పాడి పరిశ్రమ. రాష్ట్రంలో అత్యధిక మంది గ్రామీణ ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అనేక ఏళ్ళ క్రితం ఈ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులతో శక్తివంతమైన సహకార వ్యవస్థను నెలకొల్పారు. దేశంలోనే ఆంధ్ర రాష్ట్రం ఈ రంగంలో మంచి పురోగతి సాధించింది. గ్రామ-జిల్లా-రాష్ట్ర స్థాయి అనే మూడు దొంతరుల వ్యవస్థీకృత సహకార రంగాన్ని అభివృద్ధి చేశారు. ఈ రంగంలో కూడా గత కొన్నేళ్ళ నుండి బడ్జెట్ నుండి పెట్టుబడి కేటాయింపులు జరపకపోగా అనేక డెయిరీలను మూసివేసింది. ఇటీవల ఈ రంగం మొత్తాన్ని బిజెపి ఒత్తిడితో గుజరాత్‌కు చెందిన అమూల్ సంస్థ పరం చేసింది. ఈ చర్యలు డెయిరీ రంగంలో సహకార వ్యవస్థ పూర్తిగా ధ్వంసమవ్వటానికి దారితీస్తాయి.

విద్య, వైద్య, సామాజిక రంగాల్లో కూడా పెట్టుబడుల వ్యయం తగినంతగా పెంచటంలేదు. కేవలం అమ్మ ఒడి, నాడు నేడులకే విద్యా రంగంలో ప్రభుత్వం పరిమితమయ్యింది. గత కొంత కాలంగా పాఠశాలల విలీనం, ప్రభుత్వ విద్యా రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం పెంచే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతున్నది. కొత్తగా విద్యా సంస్థల విస్తరణకు స్వస్తి పలికింది. కాలేజీలు, యూనివర్సిటీల్లో అవసరమైన భవనాల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించటం లేదు. విద్య కార్పొరేటీకరణను ప్రోత్సహిస్తున్నది.

వైద్యరంగంలో కూడా పెట్టుబడుల వ్యయం కోతకు గురౌతున్నది. ప్రణాళికాబద్ధంగా ఆరోగ్య సదుపాయాలను ప్రజలకు అందించే చర్యలు చేపట్టటంలేదు. మెడికల్ కాలేజీల పేర ప్రాథమిక, ప్రాంతీయ, జిల్లా స్థాయి ఆసుపత్రులకు పెట్టుబడి నిధులు కేటాయించటంలేదు. ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ పేర ఈ రంగాన్ని నీరుగారుస్తున్నది.

ఇక వెనుకబడి ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో ప్రణాళికా బద్ధంగా వివిధ రంగాల్లో ప్రజలకు రోడ్లు, మంచినీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా బడ్జెట్ నుండి పెట్టుబడి నిధులు కేటాయించటంలేదు. ఈ ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. చివరికి కేంద్ర రాష్ట్ర ఆర్థిక ఫైనాన్స్ కమిషన్ల నిధులను కూడా పట్టణ గ్రామీణ స్థానిక సంస్థలకు విడుదల చేయకుండా దారి మళ్ళిస్తోంది. విధులు-నిధులను వికేంద్రీకరించ కుండా రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని కాగితాలకే పరిమితం చేసింది. రాష్ట్రాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక లేకుండా, తగిన విధంగా బడ్జెట్ నుండి పెట్టుబడి నిధులు కేటాయించి ఖర్చు చేయకుండా కేవలం సంక్షేమ పథకాల ద్వారానే రాష్ట్రం సమగ్రాభివృద్ధి జరగడం అసాధ్యం. రాష్ట్ర ప్రభుత్వ దృక్పథం మారాలి.

(వ్యాసకర్త సెల్ : 9490098792)

కొరియా యుద్ధం : అమెరికా నేర్వాల్సిన గుణపాఠాలు!

> **అమెరికా అగ్రరాజ్యంగా వున్నందున, అది చేసిన తప్పుల ప్రభావాలు కూడా చాలా బలంగా వుంటాయి. ప్రాంతీయ ప్రధాన శక్తుల చట్టబద్ధమైన భద్రతా ఆందోళనలను గౌరవించాలన్నది ప్రధానంగా నేర్చుకోవాల్సిన విలువైన మొదటి పాఠం. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా సంయమనం పాటించాలన్నది రెండో పాఠం. ఇక చివరిది, తన మాతృభూమిని పరిరక్షించుకోవాలన్న చైనా కృతనిశ్చయాన్ని అమెరికా ఎన్నడూ తక్కువగా అంచనా వేయరాదు. ఇది అన్నింటికంటే ముఖ్యమైనది.**

వ్యాఖ్య

కొరియా యుద్ధ విమరణ సంధిపై సంతకాలు జరిగి గురువారానికి 70 ఏళ్ళు పూర్తయింది. ఈ సంస్మరణ దినానికి ముందుగా, అమెరికా అణు బాలిస్టిక్ క్షిపణి దక్షిణ కొరియాలోని బుసాన్‌లో పర్యటించింది. 1981 తర్వాత అమెరికా జలాంతర్గామి జరిపిన మొదటి పర్యటన ఇది. ఈ చర్య ఉత్తర కొరియాకు హెచ్చరిక మాత్రమే కాదని, చైనాను నిలువరించడానికి కూడానని కొంతమంది అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు బహిరంగంగానే చెప్పారు.

అయితే ఇదంతా చూస్తుంటే కొరియా యుద్ధం నుండి నేర్చుకున్న గుణపాఠాలను అమెరికా సీరియస్‌గా తీసుకోనట్లు కనిపిస్తోంది. ఆనాడు చేసిన తప్పులనే పునరావృతం చేయాలని చూస్తున్నట్లుంది. ఫలితంగా, ఈ యుద్ధ విరమణ సంధి డెబ్బయ్యవ వార్షికోత్సవ తరుణంలో, యుద్ధం వల్ల నేర్చుకున్న గుణపాఠాలను సమీక్షించాల్సిన అత్యవసర ప్రాధాన్యత వుంది.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన అత్యంత తీవ్రమైన ప్రాంతీయ ఘర్షణల్లో కొరియా యుద్ధం ఒకటి. అమెరికా సైనిక చరిత్రలో అతి పెద్ద ఓటమిగా దీన్ని పరిగణిస్తారు. అయితే పీడకలగా నిలిచిన ఆ పరాజయాన్ని అమెరికా మరిచిపోయినట్లు కనిపించడం విచారకరం. ఉద్దేశపూర్వకంగానే అమెరికా దీన్ని విస్మరిస్తోంది. గతం నుండి గుణపాఠాలు నేర్చుకోవడంపై అమెరికన్లు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో కొత్త సంక్షోభాలు తలెత్తినపుడు వాటిని ఎదుర్కొనడంలో ఇబ్బందులు పడతారు. పైగా చేసిన పాత తప్పులనే మళ్లీ చేసే అవకాశం వుంటుంది. అంతకన్నా అధ్వాన్నమైన అంశమేమంటే, కొంతమంది అమెరికన్ రాజకీయ నేతలు ఈ కొరియా యుద్ధం నుండి పూర్తిగా తప్పుడు పాఠాలు నేర్చుకున్నారు. వాటిని ఉపయోగించే నేటి అమెరికా విదేశాంగ విధానానికి తప్పుడు మార్గనిర్దేశనం చేస్తున్నారు. దీంతో కొత్త సంక్షోభాలను, చివరకు యుద్ధాలను కూడా అమెరికా రెచ్చగొట్టడానికి దారితీస్తోంది.

అమెరికాకు కొరియా యుద్ధం నేర్పిన మూడు పాఠాలను పేర్కొంటూ అమెరికా విదేశీ వ్యవహారాల మేగజైన్ ఒక వ్యాసాన్ని ప్రచురించింది. "నిరోధకతను, సంసిద్ధతను వాషింగ్టన్ ఎన్నడూ అలక్ష్యం చేయరాదు. సదా పోరాటానికి, సైనిక పాటవాన్ని పెంచుకోవడానికి సిద్ధంగా వుండాలి" అన్నది మొదటి పాఠం. "రాజకీయాలు, పోరాటాలు అనేవి లోతుగా పెనవేసుకున్నాయ"న్నది రెండో పాఠం. "ఒకసారి పోరాటం చెలరేగిన తర్వాత, మితిమీరిన స్వీయ నిగ్రహం మరింతగా దూకుడును ఆహ్వానించగలదు." అన్నది మూడో పాఠం.

ఈ మూడు పాఠాలు చైనాను లక్ష్యంగా చేసుకున్నాయి. ముఖ్యంగా తైవాన్ సమస్యను ప్రస్తావిస్తున్నాయి. అమెరికా అగ్రరాజ్యంగా వున్నందున, అది చేసిన తప్పుల ప్రభావాలు కూడా చాలా బలంగా వుంటాయి. వాటి వల్ల తనకు మాత్రమే ప్రమాదం గాకుండా ఆ ప్రాంతానికి, మొత్తంగా ప్రపంచానికి కూడా పెను భారంగా పరిణమిస్తాయి. ప్రాంతీయ ప్రధాన శక్తుల చట్టబద్ధమైన భద్రతా ఆందోళనలను గౌరవించాలన్నది ప్రధానంగా నేర్చుకోవాల్సిన విలువైన మొదటి పాఠం. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా సంయమనం పాటించాలన్నది రెండో పాఠం. ఇక చివరిది, తన మాతృభూమిని పరిరక్షించుకోవాలన్న చైనా కృతనిశ్చయాన్ని అమెరికా ఎన్నడూ తక్కువగా అంచనా వేయరాదు. ఇది అన్నింటికంటే ముఖ్యమైనది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

జనవాక్యం

మహిళల పోరు యాత్రకు జేజేలు

మహిళలకు రక్షణ కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సాగుతున్న చారిత్రాత్మక ప్రచార యాత్రకు జేజేలు.

స్వతంత్ర భారతంలో జాతికి జన్మనిచ్చిన స్త్రీలపై, బిడ్డలపై సాగే భయంకర హత్యలు, అత్యాచారాలు, అఘాయిత్యాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని, పాలక వర్గాలను కోరుతూ జరుగుతున్న రాష్ట్ర వ్యాప్త ప్రచారయాత్ర ప్రభుత్వాలకు హెచ్చరిక వంటిది.

భారత స్త్రీ మార్కెట్ సరుకుగా చీకటి బజారులో అమ్మబడుతున్న రాక్షస వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతున్నది. ప్రభుత్వ రక్షక యంత్రాంగం, అధికారులు తమ బాధ్యతలన్నింటిలోనూ మహిళల, బిడ్డల రక్షణ ప్రధానమైనదిగా నిరంతరం పనిచేయాలి. రాష్ట్రంలో పెరిగిపోయిన అవినీతిని, అత్యాచారాలను, దోపిడీ శక్తులను అరికట్టడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

అభ్యుదయవాదులు, సమాజ సంక్షేమం కోరే పెద్దలు, కార్యకర్తలు మహిళా ఉద్యమానికి మరింత వెన్నుదన్నుగా నిలవాలి. మహిళా ఉద్యమ అభివృద్ధికి సహాయం అందించాలి.

రాష్ట్ర వ్యాపితంగా కురుస్తున్న కుండపోత వర్షాలలో పిల్లలను, సంసారాలను వదలి...అత్యంత చైతన్య యుతంగా పోరు యాత్రలో పాల్గొంటున్న...మహిళలు, ఉద్యమ కార్యకర్తలకు జేజేలు. రాష్ట్ర మహిళా సంఘం సాహసంతో చేపట్టిన ఈ ప్రచార యాత్ర జయప్రదంగా సాగాలని కోరుకుంటూ రథసారథులకు అభినందనలతో...

- అల్లూరి మన్మోహిని

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

వ్యాఖ్య

మోసకారి మాటలు

> **నరేంద్ర మోడీ హయాంలో ప్రజల వాస్తవ ఆదాయం తగ్గిపోయింది. అంతేకాకుండా ఆయన హయాంలో నిత్యావసరాల ధరలు పెరుగుతూనే వున్నాయి. సామాన్యులు వినియోగించే వస్తువుల ధరలు, ముఖ్యంగా ఆహార పదార్థాల ధరలు ఇంత భారీ స్థాయిలో గతంలో ఎన్నడూ పెరగలేదు. ఒకవైపు వాస్తవ ఆదాయం తగ్గిపోతుంటే మరోవైపు జీవన వ్యయం పెరిగిపోతోంది. ఈ కాలంలో ధనవంతుల ఆదాయం, సంపద రాకెట్ వేగంతో పెరిగింది.**

నరేంద్ర మోడీ 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు అనేకానేక వాగ్దానాలు చేశారు. అప్పట్లో దేశంలో వున్న నిరుద్యోగుల సంఖ్యను అంచనావేసిన మోడీ...ఎన్నికల్లో గెలిస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. హామీ ఇచ్చిన ప్రకారం ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు వచ్చినట్లయితే ఐదేళ్లలో దాదాపు నిరుద్యోగు లందరికీ ఉపాధి లభించి వుండేది. నిజానికి మోడీ ఆ ఐదేళ్ల తర్వాత రెండోసారి కూడా ప్రధాని అయ్యారు. మొత్తం తొమ్మిదేళ్లుగా ఆయన అధికారంలో ఉన్నారు. కానీ ఏడాదిలో కనీసం 2 లక్షల మంది నిరుద్యోగులకు కూడా ఉపాధి కల్పించలేకపోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఫలితంగా దేశంలో నిరుద్యోగుల సంఖ్య లేదా నిరుద్యోగిత రేటు తగ్గకపోగా పెరిగిపోయింది. దేశంలో నిరుద్యోగం ఆయన అధికారంలోకి రాకముందు కంటే నేడు చాలా ఎక్కువగా వుంది. గత తొమ్మిది సంవత్సరాలలో, ఆయన కొత్త ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమయ్యారు. పని చేసే వారి లేదా కొత్త ఉద్యోగాలు పొందిన వారి ఆదాయం/జీతం పెరగకపోగా చాలా సందర్భాలలో తగ్గింది. అంటే నరేంద్ర మోడీ హయాంలో ప్రజల వాస్తవ ఆదాయం తగ్గిపోయింది. అంతేకాకుండా ఆయన హయాంలో నిత్యావసరాల ధరలు పెరుగుతూనే వున్నాయి. సామాన్యులు వినియోగించే వస్తువుల ధరలు, ముఖ్యంగా ఆహార పదార్థాల ధరలు ఇంత భారీ స్థాయిలో గతంలో ఎన్నడూ పెరగలేదు. ఒకవైపు వాస్తవ ఆదాయం తగ్గిపోతుంటే మరోవైపు జీవన వ్యయం పెరిగిపోతోంది. ఉన్న చోట ఉపాధి దొరకక వలసలు పోవడం వల్ల దేశ ప్రజల జీవన ప్రమాణాలు క్షీణించాయి. ఈ కాలంలో ధనవంతుల ఆదాయం, సంపద రాకెట్ వేగంతో పెరిగింది. అందువల్ల, ప్రపంచం లోని మిలియనీర్లు, శత కోటీశ్వరుల జాబితాలో భారతీయ బిలియనీర్ల సంఖ్య పెరిగింది. మోడీ హయాంలో జరిగిన ఆర్థికాభివృద్ధి అంతటిని పారిశ్రామికవేత్తలు సొంతం చేసుకున్నారని అర్థమవుతోంది.

ఇటువంటి కఠోర వాస్తవాల నడుమ నిలబడిన మోడీ....తను మూడోసారి ప్రధాని కావడం ద్వారా భారత్‌ను మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. అంతేగాని, తాను మూడవసారి ప్రధాని అయితే సరుకుల ధరలు పెరగనివ్వబోమని మాత్రం చెప్పలేదు. కానీ 'దేశంలోని ఏ ఒక్క వ్యక్తిని కూడా ఖాళీగా కూర్చోనివ్వొద్దు' అన్నారు. ప్రతి ఒక్కరికీ పనిని కల్పించమన్నారు. ఆయన పూర్తి స్పృహతో ఆ మాట చెప్పలేదు. ఎందుకంటే ఆయన ఊహించిన మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగులకు, సామాన్యులకు ఒరిగేదేమీ ఉండదు. వారు ఎప్పటిలాగే అధిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగం-తక్కువ ఆదాయాల వల్ల నలిగిపోతారు. అదానీ వంటి సంపన్నులు వెలిగిపోతారు. అయితే ప్రస్తుత స్థాయిలో ఆర్థిక వ్యవస్థ మూడవ అతి పెద్ద దేశంగా మారడానికి మోడీ అవసరం ఉండదు. యుపిఎ హయాంలో వృద్ధిరేటు సాధించిన వేగంతో కొనసాగి ఉంటే భారత్ ఇప్పటికే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగి ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చాక దాన్ని సాధించడానికి బదులుగా ఆ విజయాన్ని కొద్ది సంవత్సరాలపాటు వెనక్కి నెట్టేశారు.

('గణశక్తి' సంపాదకీయం)

2న సర్పంచుల చలో ఢిల్లీ

పంచాయతీల నిధులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడంపై కేంద్రానికి ఫిర్యాదు చేసేందుకు ఆగస్టు 2వ తేదీన ఢిల్లీ వెళ్లనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ పరిషత్ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

దక్షిణమధ్య రైల్వే

మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు. ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-టెండర్ నోటీసు ఆహ్వానం (http://ireps.gov.in ద్వారా)

PUB/0834

భారత రాష్ట్రపతి మరియు చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్), సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ తరపున టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకెట్ సిస్టమ్‌లో క్రింది విధమైన పనుల కొరకు ఇ-టెండర్లు ఆహ్వానించడమైనది.

1. నిట్ నం. : ఇ(జిఎస్)/సిఎన్/2023-2024, తేది : 27.07.2023, పని పేరు : టెండర్ నం.09/2023-24/ఇ-జిఎస్-సిఎన్ : పని పేరు : మనోహరాబాద్ - కొత్తపల్లి కొత్త బిజి లైన్ ప్రాజెక్ట్: కొత్త స్టేషన్ భవనం, ఆర్‌బిజిఇ గదులు, గూమ్టీలు, ఇతర సేవా భవనాలు, ప్లాట్‌ఫారమ్‌లు, సర్క్యులేటింగ్ ప్రాంతాలు, సిరిసిల్ల, గుర్రాలగొండి, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు మరియు కనెక్ట్ చేయబడిన విద్యుత్ పనులు, చిన్నలింగాపూర్ రైల్వేస్టేషన్‌లో అప్రోచ్ రోడ్ లైటింగ్ మరియు యార్డు విద్యుద్దీకరణ. సుమారు ఖరీదు : రూ.5,30,27,277.00/-, ఇఎమ్‌డి : రూ.4,15,100.00/-, డాక్యుమెంట్ ఖరీదు : లేదు, పూర్తి కాలము : 12 (నెలలు), ముగింపు తేది : 18.08.2023, 15.00 గం.

1) బిడ్ డాక్యుమెంట్లు మరియు ఇతర వివరాల కొరకు http://ireps.gov.in లాగిన్ అవ్వండి.
2) ధరావత్తు మొత్తం చెల్లింపు టెండర్ డాక్యుమెంట్ డిపాజిట్ మరియు ఖర్చు ఐఆర్ఇపిఎస్ లో నెట్ బ్యాంకింగ్ / చెల్లింపు గేట్‌వే సౌకర్యాల ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి.
3) టెండర్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు టెండర్ వ్యవధి కాలం ముగింపుకు పదిహేను రోజుల ముందు సమర్పించాలి.
4) ఏదైనా సవరణ కొరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) టెండర్ సమర్పణ కాలం ప్రారంభం వరకు టెండరర్లు చూసుకోవాలి.

డివై.చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (కన్‌స్ట్రక్షన్)
సికింద్రాబాద్

తేది : 27.07.2023, టెండర్ నం.జిటిఎల్-ఇఎమ్-07 మరియు 09-2023-24.

PUB/0840

భారత రాష్ట్రపతి మరియు సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/గుంతకల్లు తరపున క్రింది విధమైన పనులు కొరకు తాత్కాలిక బాధ్యతలు నిర్వహించేందుకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

టెండర్ నం.: జిటిఎల్-ఇఎమ్-07-2023-24, పని పేరు : గుంతకల్లు డివిజన్ : ఎల్‌టి హెచ్‌టి లైన్‌లను యుజి కేబుల్స్ సిస్టమ్‌కి అప్‌గ్రేడ్ చేయడం వివిధ లొకేషన్ క్యాటరింగ్ సర్వీస్ బిల్డింగ్ క్వార్టర్స్‌కు విశ్వసనీయత కొలతగా మరియు విద్యుత్ సరఫరా నిర్వహణ వ్యవస్థకు మెరుగుదల. సుమారు విలువ : రూ.98,22,122/

ముగింపు తేది మరియు సమయం : 18.08.2023, 15.00 గం. వద్ద.

2. టెండర్ నం.: జిటిఎల్-ఇఎమ్-09-2023-24, పని పేరు : గుంతకల్లు డివిజన్ : జివై మరియు టిపిటివై పశ్చిమ స్టేషన్ ఏరియాలలో విద్యుత్ సరఫరా వ్యవస్థలకు మెరుగుదలలు. సుమారు విలువ : రూ.1,34,60,497.84 /-,

ముగింపు తేది మరియు సమయం : 21.08.2023, 15.00 గం. వద్ద

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in లాగిన్ అవ్వండి. టెండర్ యొక్క సవరణ ఏదైనా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండర్ డాక్యుమెంట్లను టెండర్ దారులు http://www.ireps.gov.in ద్వారా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

గమనిక : ఈ ఇ-టెండర్‌లో పాల్గొనాలనుకునే బిడ్డర్ డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.

ఎస్.ఆర్. డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్లు.

ఇండియన్ రైల్వేస్
రైల్వే విద్యుదీకరణ
www.ireps.gov.in

PUB/0842

తేది : 26.07.2023, టెండర్ నోటీసు నం.ఆర్.ఇ/ఎస్‌సి/ఇఎల్/66/23.

డి.వై. చీఫ్ ఇంజనీర్, రైల్వే విద్యుదీకరణ, సికింద్రాబాద్ ద్వారా క్రింది పనుల కొరకు ఇ-టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి, మరియు ఇవి 25.08.2023న 11.00 గం. వరకు, డిప్యూ.చీఫ్ ఇంజనీర్, రైల్వే విద్యుదీకరణ ఆఫీసు, సికింద్రాబాద్ వద్ద స్వీకరించబడును. తదుపరి 11.30 గం.కు తెరవబడును. టెండర్ కొరకు పనుల వివరాలు క్రింది విధముగా:

1. పని వివరం : బి.ఇ.ఆర్/ఎస్‌సి/ఇఎల్/004-23 : పని పేరు : దక్షిణ మధ్య రైల్వేలో జిఆర్.208 విభాగాల విద్యుదీకరణ ఆర్‌వీఎల్ కి సంబంధించిన సికింద్రాబాద్ స్టేషన్ వద్ద ట్రిప్ షెడ్ ప్రతిపాదిత నిర్మాణం. సుమారు విలువ : రూ.1,36,39,351.94/- ఇఎమ్‌డి : రూ.2,18,200/-, టెండర్ ఫారం యొక్క ఖరీదు : లేదు, పూర్తి కాలం : (12) నెలలు.
2. పని వివరం : బి.ఇ.ఆర్/ఎస్‌సి/ఇఎల్/005-23 : పని పేరు : దక్షిణ మధ్య రైల్వేలో జిఆర్.209 విభాగాల విద్యుదీకరణ ఆర్‌వీఎల్ కి సంబంధించిన నల్లపాడు స్టేషన్ వద్ద ట్రిప్ షెడ్ ప్రతిపాదిత నిర్మాణం. సుమారు విలువ : రూ.1,36,39,351.94/- ఇఎమ్‌డి : రూ.2,18,200/-, టెండర్ ఫారం యొక్క ఖరీదు : లేదు, పూర్తి కాలం : (12) నెలలు.

1. డాక్యుమెంట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండు తేదీ: 26.07.2023, సా.5.00 గం.
2. ఇ-బిడ్ సమర్పణ ప్రారంభ తేది : 25.08.2023, ఉ.11.00 గం.
3. ఆన్‌లైన్ ద్వారా టెండర్ ముగింపు : 25.08.2023, ఉ.11.00 గం.
4. ఆన్‌లైన్ ద్వారా టెండర్ ప్రారంభం : 25.08.2023, ఉ.11.30 గం.

టెండర్ డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ కొరకు మరియు తదుపరి టెండర్ షరతులు/వివరాలు (టెండర్ డాక్యుమెంట్లలో వివరించిన విధంగా) కొరకు దయచేసి మా వెబ్‌సైట్ "www.ireps.gov.in" ని సందర్శించండి.

టెండర్ డాక్యుమెంట్లు/సవరణ/అనుబంధంలో ఏదైనా మార్పులు ఉంటే వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడును.

డి.వై. చీఫ్ ఇంజనీర్ రైల్వే విద్యుదీకరణ
సికింద్రాబాద్

A1170

తమవద్ద టెండరు నిబంధనలు/ వివరాలు కొరకు మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ కొరకు వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి

ప్రొఫెసర్ హౌజింగ్‌కు సంఘీభావం

32 మంది స్వదేశీ, విదేశీ విద్యావేత్తల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ: మణిపూర్ ఘటనపై మాట్లాడి క్రిమినల్ కేసును ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ ఖమ్ ఖాన్ సువాన్ హౌజింగ్‌కు విద్యావేత్తల నుంచి మద్దతు లభించింది. ఆయనకు సంఘీభావంగా భారత్‌తో పాటు విదేశాలలోని విశ్వవిద్యాలయాలకు చెందిన 32 మంది విద్యావేత్తల బృందం ఒక ప్రకటన విడుదల చేసింది. హౌజింగ్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. హౌజింగ్‌కు వ్యతిరేకంగా మెయితీ ట్రైబ్స్ యూనియన్ (ఎంటీయూ) సభ్యుడు మణిహార్ మొయిరంగ్థెమ్ సింగ్ ఫిర్యాదు చేశారు. దీనిపై చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అషేమ్ తరుణకుమారి దేవి విచారణ జరిపారు. అనంతరం ఈనెల 6న ఇంఫాల్ ఈస్ట్ జిల్లా కోర్టు హౌజింగ్‌కు సమన్లు జారీ చేసింది. మణిపూర్‌లో కొనసాగుతున్న జాతి సంఘర్షణ గురించి హౌజింగ్ ఒక ఇంటర్వ్యూలో మణిపూర్ అంశంపై వ్యాఖ్యలు చేశారు. అయితే, హౌజింగ్‌పై చర్యను విద్యావేత్తలు తప్పుబడుతూ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. అందులో వారు తమ ఆందోళనను వెలిబుచ్చారు. "ప్రొఫెసర్ హౌజింగ్ రెండు దశాబ్దాలకు పైగా ఈశాన్య భారతదేశంలోని సమాజాలు, జాతి సంఘర్షణలు, జాతీయవాదం, పౌర జీవితం, అంతర్-జాతి సంబంధాలు, భారతదేశంలోని రాజకీయ ప్రక్రియలపై నిష్కళంకమైన పరిశోధనలు చేశారు. అతను దేశంలో, విదేశాలలో అత్యంత ప్రసిద్ధ పత్రికలలో ప్రచురించిన విస్తృతంగా ఉదహరించబడిన రచయిత. అంతేకాకుండా, అతను ఈ ప్రాంతంలోని అనేక తరాల యువతకు మార్గదర్శకత్వం వహించారు. భారతదేశం అంతటా యువ పరిశోధకులను ప్రేరేపించారు. విద్య పట్ల అతని నిబద్ధత ప్రశంసనీయం. అతను విద్యా సంఘంలో చాలా గౌరవనీయమైన సభ్యుడు. అతని అభిప్రాయాలు విద్యాసంస్థలకు వెలుపల ఉన్న వ్యక్తులచే నేరపూరితంగా పరిగణించబడటం చాలా దురదృష్టకరం. ప్రజా క్షేత్రంలో తమ అభిప్రాయాలను పంచుకునే విద్యావేత్తలపై క్రిమినల్ ఫిర్యాదుల దాఖలు ప్రమాదకరమైన దృష్టాంతాన్ని ఏర్పరుస్తాయి. ఇది ప్రసంగం, ఆలోచన, ప్రజాస్వామ్య అభిప్రాయం మార్పిడికి అవసరమైన సెన్సార్‌షిప్‌కు మార్గం కల్పిస్తుంది. ఈశాన్య భారతదేశంలోని సమస్యల గురించి పని చేసే, రాసే నిపుణులుగా, ఇటువంటి చర్యలు విద్యాసంబంధ పరిశోధనలకు సురక్షితమైన స్థలాలను నాశనం చేయడంతో సమానమని మేము భావిస్తున్నాము. ఇది మన తోటివారిలోనే కాదు.. తర్వాతి తరం వారిలో కూడా మేధో పరమైన ఎదుగుదలకు, ఆలోచనల మార్పిడికి ఆటంకం కలిగిస్తుంది" అని ఆ ప్రకటనలో 32 మంది విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

ఏపిలో స్మార్ట్ సిటీస్ మిషన్‌కు రూ.3,538 కోట్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్మార్ట్ సిటీస్ మిషన్ ప్రాజెక్టుల కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.3,538 కోట్లు విడుదల అయ్యాయని, అందులో రూ. 2,726.43 కోట్లు ప్రాజెక్టుల వినియోగించబడిందని కేంద్ర పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. వైసిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుండి అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం స్మార్ట్ సిటీస్ మిషన్‌కు ఎంపిక అయ్యాయని, ఈ నాలుగు నగరాల్లో 279 స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు ఆమోదం పొందాయని తెలిపారు. వీటిలో 203 ప్రాజెక్టులు (73 శాతం) పూర్తి కాగా, మిగిలిన 76 ప్రాజెక్టులు (27 శాతం) ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. విడుదల అయిన నిధుల్లో విశాఖపట్నం అత్యధిక నిధులు వినియోగించగా, తిరుపతి, కాకినాడ, అమరావతి తరువాత స్థానాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతిలో అత్యధికంగా 105 ప్రాజెక్టులు ఉండగా, కాకినాడలో 94, విశాఖపట్నంలో 61, అమరావతిలో 19 ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టుల పూర్తి కావటం తిరుపతిలో 60 శాతం, కాకినాడలో 76.60 శాతం, విశాఖపట్నంలో 91.8 శాతం, అమరావతిలో 63.16 శాతంగా ఉందని పేర్కొన్నారు.

బిసిలకు ఏం చేశారో చెప్పే దమ్ముందా?

- టిడిపిపై వైసిపి ఎంపిల ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఐదేళ్ల టిడిపి పాలనలో బిసిలకు ఏం మేలు చేశారో చెప్పే దమ్ముందా? అని వైసిపి ఎంపిలు ప్రశ్నించారు. శుక్రవారం ఏపి భవన్‌లో వైసిపి ఎంపిలు మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, బీద మస్తానరావు, బెల్లాన చంద్రశేఖర్, బివి సత్యవతి మీడియాతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం నవరత్నాలతో బిసిలకు ప్రభుత్వ సంక్షేమాన్ని అందిస్తూ, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా గుర్తింపు తెచ్చిందన్నారు. ఏపిలో టిడిపి, దానికి మద్దతు తెలిపే ఇతర పార్టీలు ఉనికి కాపాడుకునేందుకు కష్టాలు పడుతున్నాయని అన్నారు. అమర్‌నాథ్ హత్య గురించి ఒంగోలు బిసి సభలో ప్రస్తావించడాన్ని ఎంపిలు తప్పుపట్టారు. హత్యకు రాజకీయ కారణాలేవీ లేవన్నారు. అమర్‌నాథ్ తల్లి, సోదరితో అబద్ధాలు పలికించడం దారుణమన్నారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే పోలీసులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలో ఉండగా, సిఎం కార్యాలయానికి సమీపంలో ఉన్న నాగార్జున యూనివర్శిటీలో బిసి విద్యార్థిని రిషితేశ్వరి హత్యకు గురికాగా, కనీసం బాధితురాలి తల్లిదండ్రుల్ని కలవడానికి కూడా చంద్రబాబు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు.

మణిపూర్ హింసాకాండకు నిరసనగా బీహార్‌లో బిజెపి నేత రాజీనామా

పాట్నా : మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండకు నిరసనగా బీహర్‌లో ఒక ప్రముఖ బిజెపి నాయకుడు ఆ పార్టీకి రాజీనామా చేశారు. మణిపూర్ హింసాకాండ ప్రపంచ వేదికపై భారత దేశ పరువుతీస్తుందని బిజెపి నాయకుడు వినోద్ శర్మ తన రాజీనామాను సమర్పించారు. బరువెక్కిన హృదయంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'భారమైన హృదయంతో బిజెపికి రాజీనామా చేశాను. మణిపూర్‌లో పరిస్థితి యావత్తు దేశాన్ని ఆందోళనకు గురి చేసింది. ప్రపంచం ముందు భారత దేశ ప్రతిష్టను దిగజార్చింది' అని తెలిపారు. రాష్ట్రంలో దారుణమైన సంఘటనలు అనేకం జరుగుతున్నాయని, ఎన్నింటిపై చర్యలు తీసుకోవాలని మణిపూర్ ముఖ్యమంత్రి చెప్పడం దుర్మార్గకరమని అన్నారు.

అటవీ హక్కులపై దాడి చేయడమే

- ఎఫ్‌సిఎ సవరణల బిల్లుపై సిపిఎం

న్యూఢిల్లీ : అటవీ సంరక్షణ చట్టం (ఎఫ్‌సిఎ) సవరణల బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం పట్ల సిపిఎం ఆందోళన వ్యక్తం చేసింది. సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం ఈ మేరకు ఒక పోస్టు చేసింది. బిల్లులో ప్రతిపాదించిన సవరణలన్నీ అటవీ సంరక్షణ చర్యలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయంటూ పర్యావరణవేత్తల నుంచి, ప్రజాసంఘాల నుంచి వెల్లువెత్తిన నిరసనలను, అభ్యంతరాలను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) కొట్టిపారేయడం సమంజసం కాదని పేర్కొంది. కమిటీలోని ప్రతిపక్షాల సభ్యులు అసమ్మతి తెలియజేసినా పట్టించుకోలేదని తెలిపింది. సవరణ చట్టంతో అటవీ హక్కులు, ఆదివాసీలు, అటవీ నివాసులపై తీవ్ర ప్రభావాలు ఉంటా ఓయని పేర్కొంది. వీటిలో ప్రధానంగా గ్రామసభ అధికారం నిర్వీర్యమ వుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే అత్యధిక అటవీ విస్తీర్ణం బ్యూరో క్రసీ, మాఫియా, కార్పొరేట్ కబంధ హస్తాల్లో కేంద్రీకృతమైపోతుందని పేర్కొంది. అత్యధిక అటవీ ప్రాంతాన్ని అటవీ సంరక్షణ చట్టం, అటవీ హక్కుల చట్టం పరిధి నుంచి తొలగింపజేసి, 'అటవీ' ప్రాంతానికి వినాశకరమైన నిర్వచ నాన్ని కొత్త సవరణల్లో పేర్కొన్నారని తెలిపింది. దీనివల్ల ఆదివాసీ సమాజానికి, అటవీ నివాసులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇడిపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. మహిళల్ని ఢిల్లీలోని ఇడి కార్యాలయానికి పిలవడంపై అభ్యంతరం తెలుపుతూ భార్య రుజిరా బెనర్జీ తరపున టిఎంసి నేత అభిషేక్ బెనర్జీ, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం భార్య నళిని చిదంబరం, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఆయా పిటిషన్లు శుక్రవారం జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్, జస్టిస్ సుధాంశు ధులియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ నిమిత్తం ఎవర్నైనా ఈడి ఢిల్లీకి పిలవచ్చా? అనే అంశాన్ని తేల్చాలని కవిత తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. వారం పది రోజులు ముందుగానే నోటీసులు ఇచ్చి పిలుస్తామని ఇడి తరపు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు తెలిపారు. దీంతో ఆయా పిటిషన్లు మెరిట్స్ ఆధారంగా పరిష్కరిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఈ మూడు పిటిషన్లలోనూ ఇడి ఆరు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని వాటిపై రెండు వారాల్లో రిజాయిండర్లు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశిస్తూ తదుపరి విచారణ వాయిదా వేసింది.

మణిపూర్‌కు ప్రతిపక్ష ఎంపిలు

- నేడు, రేపు పర్యటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హింసాకాండతో దెబ్బతిన్న మణిపూర్‌లోని పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఇండియా కూటమి ఎంపిల బృందం శని, ఆదివారాల్లో ఆ రాష్ట్రంలో పర్యటిస్తుంది. ఈ బృందంలో16 పార్టీలకు చెందిన 20 మంది ఎంపిలు ఉన్నారు. ఎంపిలు అధిర్ రంజన్ చౌదరి, గౌరవ్ గొగోయ్, ఫూలో దేవి నేతమ్ (కాంగ్రెస్), లాలన్ సింగ్, అనిల్ ప్రసాద్ హెగ్డే (జెడియు), సుస్మితా దేవ్ (టిఎంసి), కనిమొళి (డిఎంకె), ఎఎ రహీం (సిపిఎం), సంతోష్ కుమార్ (సిపిఐ), మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జెడి), జావేద్ అలీ ఖాన్ (ఎస్‌పి), పి.పి మహ్మద్ ఫైజల్ (ఎన్‌సిపి), ఈ.టి మహ్మద్ బషీర్ (ఎన్‌సిపి), ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్‌ఎస్‌పి), సుశీల్ గుప్తా (ఆప్), అరవింద్ సావంత్ (శివసేన (ఉద్ధవ్ ఠాక్రే)), రవి కుమార్, తిరుమావళవన్ (విసికె), జయంత్ చౌదరి (ఆర్‌ఎల్‌డి), మహువా మజీ (జెఎంఎం) ఈ బృందంలో ఉన్నారు.

శాంతియుత నిరసనలపై పెరూ ఖాకీల అణచివేత

లిమా : పెరూ కాంగ్రెస్ కొత్త డైరెక్టర్ల బోర్డు ఎన్నికకు వ్యతిరేకంగా శాంతియుతంగా జరుగుతున్న నిరసనలపై పెరూ పోలీసులు గురువారం దారుణంగా అణచివేత చర్యలు చేపట్టారు. బోర్డుకు ఎన్నికైన సభ్యుల్లో ఒకరు అవినీతి ఆరోపణలపై దర్యాప్తును ఎదుర్కొంటున్నారు. ఆయనపై 50కి పైగా పన్ను ఎగవేత ఆరోపణలు వున్నాయి. ఈ విషయమై లిమాలోని పార్లమెంట్ భవనం వెలుపల ఆందోళనకారులు కూర్చుని శాంతియుతంగా నిరసన తెలియచేస్తుండగా, పోలీసులు వచ్చి వారిపై దాడి చేశారు. అధ్యక్షురాలు దినా బొలార్టె ఆదేశాల మేరకు భద్రతా బలగాలు 50మందికి పైగా కాల్చి చంపిన నేపథ్యంలో దానిపై న్యాయం చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన సామాజిక సంస్థల ప్రతినిధి బృందాలు కూడా ఈ నిరసనల్లో పాల్గొన్నాయి. గతేడాది డిసెంబరులో పార్లమెంటరీ కుట్ర ద్వారా అప్పటి అధ్యక్షుడు పెడ్రో కేస్టిలోను తొలగించి, ఉపాధ్యక్షురాలిగా ఉన్న బొలార్టె అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికీ పెరూ అధికారుల చెరలోనే కేస్టిలో వున్నారు.

ప్రజాస్వామ్యం విజయం సాధిస్తుంది : నైజర్ అధ్యక్షులు

నియామె : దేశంలో ప్రజాస్వామ్యం విజయం సాధిస్తుందని నైజర్ అధ్యక్షుడు ప్రకటించారు. ఎంతగానో కష్టపడి సాధించుకున్నవన్నీ కచ్చితంగా రక్షించబడతాయని గురువారం ఉదయమే ట్వీట్ చేశారు. నైజీరియన్లందరూ ప్రజాస్వామ్యాన్ని ప్రేమిస్తారని వ్యాఖ్యానించారు. విదేశాంగ మంత్రి హసౌమి మసూదు కూడా ఇదే తరహాలో ప్రకటన చేశారు. ప్రజాస్వామిక కాముకులైన నైజీరియన్లు ఒక తాటిపై నిలబడి ఈ కుట్రను ఖండించాలని కోరారు. అధ్యక్షుడిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆనాటి యుద్ధ స్ఫూర్తితో అమెరికాను ఎదుర్కొందాం!

- కొరియా యుద్ధ విరమణ సంధిని గుర్తు చేసుకున్న చైనా, రష్యా, ఉత్తరకొరియా

ప్యాంగాంగ్ : సుదీర్ఘంగా సాగిన కొరియా యుద్ధానికి అంతం పలికిన ఆయుధ విరమణ సంధి 70వ వార్షికోత్సవాన్ని చైనా, ఉత్తర కొరియా, రష్యాలు గురువారం గుర్తు చేసుకున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్, ఇతర సీనియర్ అధికారులతో చైనా, రష్యా ప్రతినిధి బృందాలు భేటీ అయ్యాయి. ప్యాంగాంగ్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. కొరియా ద్వీపకల్పంలో, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో, యూరప్‌లో అమెరికా నేతృత్వంలోని సైనిక కూటమి నుండి చైనా, రష్యా, ఉత్తర కొరియాలు ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదుర్కొంటున్నట్లు చైనా నిపుణులు పేర్కొన్నారు. 1950వ దశకంలో ప్రపంచ దేశాల్లో నెలకొన్న తరహాలోనే ఈ పరిస్థితులు వున్నాయన్నారు. కొరియా యుద్ధం నుండి నేర్చుకున్న గుణపాఠాలను అమెరికా గుర్తుంచుకోవాలని, తప్పులను పునరావృతం చేయరాదని ఆ మూడు దేశాలు అమెరికాకు గట్టి సంకేతాలను పంపుతున్నాయని నిపుణులు పేర్కొన్నారు. ప్యాంగాంగ్‌లో గురువారం జరిగిన 70వ వార్షికోత్సవ కార్యక్రమంలో కిమ్ పాల్గొన్నారు. అమెరికా దూకుడును ప్రతిఘటించేందుకు, కొరియాకు సాయం చేసేందుకు జరిగిన యుద్ధ విజయంగా ఈ ఆయుధ విరమణ సంధిని చైనా భావిస్తుంది. ఇందుకు సంబంధించిన కార్యక్రమాలను చైనా టెలివిజన్‌లో ప్రదర్శించారు. కొత్త శకంలో అమెరికా గుత్తాధిపత్య చర్యలతో చైనా, కొత్త సవాళ్ళను ఎదుర్కొంటున్నందున ఆనాటి యుద్ధం సందర్భంగా ప్రదర్శితమైన స్ఫూర్తిని కొనసాగించాలని ప్రతిన చేశారు.

కొరియా ఆర్మిస్టిక్ ఒప్పందం డెబ్బయ్యో వార్షికోత్సవ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద పూల మాల ఉంచి నివాళులర్పిస్తున్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన కెనరా బ్యాంకు, చంద్రమౌళీనగర్ బ్రాంచ్, గుంటూరు వారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు అయిన కెనరా బ్యాంకు, చంద్రమౌళీనగర్ బ్రాంచ్, గుంటూరు వారికి రామ్ బిలాస్ కేతన్ గారి కుమారుడు విజయ్ కుమార్ కేతన్ గారు, వారి తాలూకు ఆస్థి అయిన పొత్తూరు గ్రామ సర్వే నెం.145/A నందు ఎ.0.92 సెంట్ల భూమిని M/s. రాధా రామన్ స్పైసెస్, గుంటూరు వారికి ఓ.డి. వ్యాపార లోన్ నిమిత్తం తనఖాగా ఉంచి సదరు ఆస్తికి సంబందించిన రెండు ఒరిజినల్ దస్తావేజులు అయిన నల్లపాడు సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.6052/2009 మరియు 780/2010ర్లుగా రిజిస్టరు కాబడిన రెండు ఒరిజినల్ దస్తావేజులను మరియు సదరు పైన తెలిపిన అస్థితోపాటు మరికొన్ని ఆస్తులను వాటికి సంబందించిన దస్తావేజులను విజయ్ కుమార్ కేతన్ వగైరాలు కలిసి ది.11.09.2014న నా క్లయింటు వద్ద డిపాజిట్ చేసి ది.12.09.2014న రిజిస్టర్డ్ మెమొరాండం అఫ్ డిపాజిట్ అఫ్ టైటిల్ డీడ్ ని నల్లపాడు సబ్- రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.5525/2014 రుగా రిజిస్టర్ చేసియున్నారు. ది.04.07.2023న నా క్లయింటు సదరు పై తెలిపిన రెండు ఒరిజినల్ దస్తావేజులు అయిన దస్తావేజు నెం.6052/2009 మరియు 780/2010ర్లు జిరాక్స్ నిమిత్తం గోరంట్ల ఏరియాలోని జిరాక్స్ షాప్ వద్దకు పోవుచుండగా సదరు పైన తెలిపిన రెండు ఒరిజినల్ దస్తావేజులు ఎక్కడోపోయినవి. సదరు విషయమును నా క్లయింటు ది.06.07.2023న నల్లపాడు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా సదరు నల్లపాడు స్టేషన్ హౌస్ ఆఫీసర్, వారు ది.12.07.2023న నాన్ ట్రేస్డ్ సర్టిఫికెట్ కూడా ఇచ్చియున్నారు. కావున సదరు ఆస్తికి సంబంధించి ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరములు గాని, క్లైములు గాని, గ్యారంటీలు గాని, తనఖాలు గాని, తాకట్లు మున్నగు ఉన్న ఈ దిగువ తెలిపిన అడ్రసుకు మూడు రోజుల లోపు తెలియజేయవలసినది. మరియు సదరు పైన తెలిపిన రెండు ఒరిజినల్ దస్తావేజులు అయిన దస్తావేజు నెం.6052/2009 మరియు 780/2010ర్లు ఉపయోగించి ఎవరైనా ఎటువంటి లావాదేవీలు జరిపినా సదరు లావాదేవీలు నా క్లయింటును గాని మరియు సదరు దస్తావేజులకు సంభందించిన ఆస్తిని గాని బైండు చేయజాలవు మరియు సదరు వ్యక్తులు నా క్లయింటు తీసుకొనే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యత వహించవలసి వస్తుంది.

యార్లగడ్డ రవి, న్యాయవాది
జి.యం.సి నెం. 229, 3వ లైను, రాజేంద్రనగర్, గుంటూరు-522006
ఫోన్: 77024 02777, 94404 31260.

(మొదటిపేజీ తరువాయి)

చర్చ లేదు... ఓటింగ్ లేదు

ప్రతిపక్షాలు గుర్తుచేశాయి.

రాజ్యసభలో అన్ని కార్యకలాపాలను వాయిదా వేసి, తాము లేవనెత్తిన అంశంపై చర్చించాలని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, టిఎంసి, ఎస్‌పి ఆప్, ఎన్‌సిపి, డిఎంకె తదితర ప్రతిపక్ష పార్టీలకు చెందిన 47 మంది ఎంపిలు రూల్ 267 ప్రకారం నోటీసులు ఇచ్చారు. అయితే సభ ప్రారంభమైన వెంటనే ఇద్దరు సభ్యులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. పదవీ విరమణ చేస్తున్న బిజెపి ఎంపి వినయ్ దినుర్ టెండూల్కర్‌కు వీడ్కోలు పలికింది. అనంతరం రూల్ 267 ప్రకారం నోటీసులిచ్చిన ఎంపిల పేర్లను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ చదివారు. సభ్యులు లేవనెత్తిన అంశంపై చర్చించేందుకు అంగీకారం తెలిపానని గుర్తు చేశారు. ప్రశ్నోత్తరాల సమయం చాలా ముఖ్యమైనదని, ఎంపిలు ప్రభుత్వాన్ని ప్రశ్నలు అడుగుతారని చెప్పారు. పార్లమెంటరీ కార్యకలాపాలకు ప్రశ్నోత్తరాల సమయం హృదయం వంటిదని తెలిపారు.

ధనఖర్ వర్సెస్ డెరిక్

దీంతో డెరెక్ ఒబ్రెయిన్ స్పందిస్తూ, "ఇదంతా మాకు తెలుసు" అన్నారు. సమావేశాలు ప్రాంభమైనప్పటి నుంచి మణిపూర్ హింసాకాండ గురించి ప్రతిపక్షాలు లేవనెత్తుతున్నాయని, దానిని చేపట్టాలని డిమాండ్ చేశారు. జగదీప్ ధన్‌ఖర్ స్పందిస్తూ "దీని గురించి మీకు తెలుసునని నాకు తెలుసు. మీరు చెప్పనక్కర్లేదు. కేవలం వినండి చాలు. మీరు వింటే, మీకు అర్థమవుతుంది" అని అన్నారు. కానీ ఒబ్రెయిన్ వెనుకంజ వేయలేదు. దీంతో ఒబ్రెయిన్‌ను ఆయన స్థానంలో కూర్చోవాలని ధన్‌ఖర్ కోరారు. "మిస్టర్ డెరెక్ ఒబ్రెయిన్, నాటకీయ ప్రదర్శనలు చేయడం మీకు అలవాటుగా మారింది. ప్రతిసారీ మీరు లేచి నిలబడతారు. అది మీ విశేష అధికారంగా భావిస్తారు. సభాపతి స్థానాన్ని గౌరవించడం మీ కనీస కర్తవ్యం. నేను ఏం చెప్పినా, మీరు లేచి, నాటక ప్రదర్శనలు చేస్తారు" అని మండిపడ్డారు. జగదీప్ ధన్‌ఖర్ వ్యాఖ్యలపై స్పందించిన ఒబ్రెయిన్ తన ముందు ఉన్న బల్లపై గట్టిగా కొడుతూ, తాను నిబంధనలకు అనుగుణంగానే ప్రవర్తిస్తున్నానని చెప్పారు. దీనికి ధన్‌ఖర్ స్పందిస్తూ "బల్ల మీద కొట్టకండి. ఇది రంగస్థలం కాదు. మేం దీనిని సహించం, ఐయామ్ సారీ" అన్నారు. ఒబ్రెయిన్ ఏదో చెప్పబోతుండగా, ధన్‌ఖర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. "దీనిని మేం భరించలేం" అని అంటూ సభ నుంచి వెళ్లిపోయారు.

వచ్చే వారంలో పార్లమెంట్‌కు ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లు విప్‌లు జారీ చేసిన పార్టీలు, అనారోగ్యంతో ఉన్న ఎంపిలకు అంబులెన్స్‌లు

అత్యంత వివాదాస్పదమైన ఢిల్లీ సర్వీసెస్ బిల్లును వచ్చే వారంలో పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు పోరాటానికి సిద్ధమయ్యాయి. తమ ఎంపిలకు విప్‌లు జారీ చేశాయి. తమ సభ్యుల 100 శాతం హాజరు కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాయి. అనారోగ్యంతో ఉన్న ఎంపిల కోసం అంబులెన్సులు కూడా ఏర్పాటు చేస్తున్నాయి. అనారోగ్యంతో బాధ పడుతున్న మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ కూడా సభకు వచ్చే అవకాశముందని సమాచారం. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న మరో ఎంపి బశిష్ట నారాయణ సింగ్ (75 ఏళ్లు, జెడి(యు)) కూడా అంబులెన్స్‌లో పార్లమెంట్‌కు వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా మద్దతును కూడగట్టేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు మద్దతిస్తామని వైసిపి ఇప్పటికే ప్రకటించగా, దీనిని వ్యతిరేకిస్తామని బిఆర్‌ఎస్ తెలిపింది.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ | డోర్ నెం.30-22-79, కొల్లిపార శ్రీరాములు వీధి, 1వ అంతస్తు, ఎస్.బి.ఐ బ్యాంక్ ప్రక్కన, సీతారామపురం సర్కిల్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520002.

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యొక్క 13(2) క్రింద)

ఇందుమూలంగా **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ (ఇంతకు పూర్వము యు.టి.ఐ బ్యాంక్ లిమిటెడ్ గా తెలిసిన)** యొక్క అధీకృత అధికారి వారి రిజిస్టర్డ్ కార్యాలయము : "త్రిసూల్", సామర్తేశ్వర్ గుడి ఎదురుగా, ఎల్లిస్‌బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006, ఇతర ప్రదేశములలో ఉన్న బ్రాంచీలు నందు గల **బ్రాంచి ఆఫీస్ యాక్సిస్ బ్యాంక్ లి., డోర్ నెం.30-22-79, కొల్లిపార శ్రీరాములు వీధి, 1వ అంతస్తు, ఎస్.బి.ఐ బ్యాంక్ ప్రక్కన, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520002 మరియు కార్పొరేట్ ఆఫీస్ బొంబాయి డైయింగ్ మిల్స్ కాంపౌండ్, పాండురంగ్ బుధ్కర్ మార్గ్, వొర్లి, ముంబాయి-400025** సెక్యూర్డ్ క్రెడిటార్ వారి యొక్క పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసు జారీ చేయడమైనది.

అప్లికెంట్/కో-అప్లికెంట్/హామీదారుల యొక్క పేర్లు / ఖాతా నెం.లు : 1) శ్రీ హరినాథ్ పెండ్యాల, తండ్రి. ఆదినారాయణ పెండ్యాల, ఫ్లాట్ నెం.సి-2, శ్రీ సాయి దుర్గ రెసిడెన్సీ, ప్రశాంత్ నగర్, ఐటిఐ కాలేజ్ ఎదురుగా, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-520010. **మరియు : శ్రీ హరినాథ్ పెండ్యాల, తండ్రి. ఆదినారాయణ పెండ్యాల,** ఇ.నెం.1-84, గంగనపల్లి, నార్పల, వాటర్ పంప్ దగ్గర, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515425. **మరియు : శ్రీ హరినాథ్ పెండ్యాల,** C/o. దినేష్ రెస్టారెంట్ (ఏకైక ప్రొప్రయిటర్), డి.నెం.13/35, ఎన్.హెచ్-5, ఏలూరు రోడ్డు, నిడమనూరు, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521104. **2) శ్రీమతి పెండ్యాల శ్రీ లత, భర్త. హరినాథ్,** ఫ్లాట్ నెం.సి-2, శ్రీ సాయి దుర్గ రెసిడెన్సీ, ప్రశాంత్ నగర్, ఐటిఐ కాలేజ్ ఎదురుగా, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-520010. **మరియు : శ్రీమతి పెండ్యాల శ్రీ లత, భర్త. హరినాథ్,** ఇ.నెం.1-84, గంగనపల్లి, నార్పల, వాటర్ పంప్ దగ్గర, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515425. **మరియు : శ్రీమతి పెండ్యాల శ్రీ లత,** C/o. దినేష్ రెస్టారెంట్ (ఏకైక ప్రొప్రయిటర్), డి.నెం.13/35, ఎన్.హెచ్-5, ఏలూరు రోడ్డు, నిడమనూరు, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521104.

లోన్ అకౌంట్ నెం. : LTR006903048419, ఎన్.పి.ఎ తేదీ : 27.06.2021, డిమాండ్ నోటీసు తేదీ : 04.07.2023

బకాయి మొత్తం : తేది.05.07.2023 నుండి తదుపరి వడ్డీతో (ఈ మొత్తం వడ్డీ సహా ప్లస్ **04.07.2023** వరకు జరిమానా ఛార్జీలు) ఒప్పందం యొక్క ముగింపు మీద మొత్తం కలిగిన బకాయిలు **తేది.04.07.2023 నాటికి రూ.53,12,901/- (అక్షరాల యాభై మూడు లక్షల పన్నెండు వేల తొమ్మిది వందల ఒక్క రూపాయి మాత్రమే)**

షెడ్యూల్ ఆస్తి వివరములు : అనంతపురం జిల్లా, అనంతపురం సబ్ డివిజన్, పాపంపేట గ్రామం, నారాయణపురం పంచాయితీ, సర్వే నెం.67/1 భాగం, ప్లాట్ నెం.8, ఎల్.పి.నెం.44/1996 లోని మొత్తం విస్తీర్ణం 357.77 చ॥గ॥లులోని భూమి మరియు నిర్మాణంతో ఉన్న ఆస్తి. **హద్దులు : తూర్పు :** 40 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం :** ప్లాట్ నెం.9, **పడమర :** ఇతరుల ఆస్తి, **ఉత్తరం :** ప్లాట్ నెం.7.

SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(2) నియమాల ప్రకారం పైన తెలిపిన వ్యక్తులు తదుపరి వడ్డీలు మరియు ఇతర ఖర్చులను తిరిగి చెల్లించడంలో విఫలం చెందియున్నారు. **SARFAESI** చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు ఇతర చట్టాల ప్రకారం బ్యాంకు వారు ఈ నోటీసు జారీ చేసిన 60 రోజులలోగా అధీనంలోకి తీసుకోబడుతుంది. ఈ నోటీసు బ్యాంకు వారికి ఎటువంటి పక్షపాతం లేకుండా మొదలుపెట్టే ఇతర చర్యలు మరియు న్యాయపరమైన విధానాలు ఉన్న చట్టాల ప్రకారం దీనిని చేయాల్సి ఉంది.

తేది : 28.07.2023 ప్రదేశము : విజయవాడ — **సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

రాయలసీమకు తీవ్ర అన్యాయం

- రాయలసీమ పరిరక్షణ సమితి కన్వీనర్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి
- జంతర్ మంతర్‌లో సేవ్ రాయలసీమ ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రాయలసీమ పరిరక్షణ సమితి కన్వీనర్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో రాయలసీమ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సేవ్ రాయల సీమ పేరుతో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. రాయలసీమకు ఐకానిక్ బ్రిడ్జ్ అవసరం లేదని, బ్యారెజ్ అవసరమని పేర్కొన్నారు. కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా చేపడుతున్న అప్పర్ తుంగభద్ర డ్యాముల నిర్మాణాన్నిఅడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఇది రాయలసీమకే కాదని, తెలంగాణకు కూడా నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై జగన్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. తుగ్లక్ అయినా కొన్ని మంచి పనులు చేసారని, కానీ ప్రస్తుత సిఎం వ్యవహరిస్తున్న తీరు దారుణమని అన్నారు. రాయలసీమలో హైకోర్టు అన్నారని, అయితే అక్కడ కుర్చీ కూడా లేదని విమర్శించారు. విదర్భ, రాజస్థాన్ కంటే ఘోరమైన పరిస్థితి రాయలసీమలో ఉందని అన్నారు. వైఎస్ జగన్‌కు శ్రీబాగ్ ఒప్పందం.. అందులో ఏం అంశాలు ఉన్నాయో తెలుసా? అని ప్రశ్నించారు.

గోధుమల ఎగుమతులకు సబ్సిడీ ఇవ్వలేం: ఈయు

బ్రస్సెల్స్ : ఉక్రెయిన్ గోధుమల ఎగుమతులకు సబ్సిడీ ఇవ్వడానికి యురోపియన్ కమిషన్ తిరస్కరించింది. తమ వద్ద అంత డబ్బు లేదని తెలిపింది. అయితే ఈ ఆలోచనను కొంతమంది ఇయు సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. రష్యాపై యుద్ధం జరుపుతున్న ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉక్రెయిన్ ఉత్పత్తులపై టారిఫ్‌లను, కోటాలను ఇయు గతేడాది తొలగించింది. ఉక్రెయిన్ గోధుమలను నల్ల సముద్రం గుండా తీసుకెళ్లే వాణిజ్యపరమైన నౌకలకు భద్రతాపరమైన హామీలివ్వడానికి గతేడాది జులైలో రష్యా అంగీకరించింది. కానీ ఈ నెల ప్రారంభంలో ఈ ఒప్పందం కుప్పకూలింది. తమ స్వంత ఆహార, ఎరువుల వాణిజ్యంపై ఆంక్షల విషయంలో రష్యాకు ముందుగా హామీ ఇచ్చిన రీతిలో ఉపశమనం లభించకపోవడంతో ఒప్పందం అమలును నిలుపుచేసినట్లు ప్రకటించింది. నల్ల సముద్రం రూట్‌ను కోల్పోయినందున దాన్ని భర్తీ చేయడానికి ఇతర మార్గాలను కీవ్ అన్వేషిస్తోంది. అందుకు గానూ అవసరమైన డబ్బును చెల్లించాల్సిందిగా ఇయును కోరింది. గత వారం ఇయు వాణిజ్య చీఫ్‌కు ఉక్రెయిన్ ప్రభుత్వం ఈ మేరకు ఒక లేఖ రాసింది.

భౌతికంగా స్వాధీనతా ప్రకటన

ICICI Bank | **బ్రాంచి ఆఫీసు:** ఐసిఐసిఐ బ్యాంకు లిమిటెడు, 4/10, మైత్రీ టవరు, బొమ్మనహల్లి హోసూరు మెయిను రోడ్డు, బెంగళూరు-560068.

ఏదైతే,

క్రింది సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్& ఎన్ఫోర్సుమెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండు నోటీసులు జారీచేసి, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. ఆ విధంగా రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని క్రింది సంతకందారు ఇందు దిగువ పేర్కొన్న తేదీలలో స్వాధీనంచేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ కు చెల్లించుటకులోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరణ/ భౌతిక స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తాలు (రూ)	బ్రాంచి పేరు
1.	సిహెచ్ రామ్ కుమార్/ తోట మణిగోపిక/ LBVJW00005894179/ LBVJW00006046755	షెడ్యూలు"ఎ": కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్-రిజిస్ట్రార్ ఏరియా, మచిలీపట్నం టౌన్, చిలకులపూడిలో మున్సిపల్ వార్డు నం.20, ఆర్.ఎస్.నం.382/1, పాత డోర్‌నం.20/153-2, ప్రస్తుత డోర్ నం.20/153-2, విస్తీర్ణం 382.63చ.గ.లు లేదా 319.78చ.మీ.ల ఇంటి సైటు. సరిహద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్ వైపు ఈ ఆస్తికి ప్రహారీగోడ, దక్షిణం: పినిశెట్టి లక్ష్మయ్య దారి వైపు ఈ ఆస్తి యొక్క ప్రహారీగోడ, పడమర: నూకల రంగారావు యొక్క ఆస్తి వైపు ఈ ఆస్తికి ప్రహారీగోడ, ఉత్తరం: బొగడి రామకృష్ణ ఆస్తి వైపు ఈ ఆస్తి యొక్క ప్రహారీగోడ, ఈ నాలుగు సరిహద్దుల్లో 382.63చ.గ.లు లేదా 319.878చ.మీ.లకుగాను విడదీయలేని మరియు సూచించని 42.51చ.గ.లు లేదా 35.54చ.మీ.ల విస్తీర్ణంగల ఇంటి సైటు. షెడ్యూలు "బి": "కొండపల్లి హైట్స్" అసెస్మెంట్ నం., డోర్ నం.20/153-2-టిఎఫ్-301, మూడవ అంతస్తు, ఫ్లాట్ నం.301లో పేరు& స్టైల్ క్రింద సైటు. సరిహద్దులు: తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: ఫ్లాట్ నం.302, ఉత్తరం: ఒపెన్ టు స్కై/ భౌతిక స్వాధీనం తేది: 25.07.2023.	17.10.2022 Rs. 31,47,828.00/-	విజయవాడ

పై పేర్కొన్న రుణగ్రహీతలు/ హామీదారు, ఇందుమూలంగా మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా ఇందుమూలంగా, 30 రోజుల ప్రకటన ఇవ్వబడుచున్నది, లేనిచో తాకట్టుపెట్టిన ఆస్తులను సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9 క్రింది నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 30 రోజులు ముగిసిన తరువాత విక్రయించబడుతుంది.

తేది: జులై 28, 2023, ప్రదేశం: విజయవాడ & కృష్ణ

అధీకృత అధికారి,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

మీకోసం
కళ్లకింద నలుపు పోవాలంటే బంగాళాదుంపలను చిన్న ముక్కలుగా కోసి, కళ్లకింద పెట్టుకోవాలి.

జీవన సౌరభం
ఆలోచనలు ఎల్లప్పుడూ ఉన్నతంగా ఉండాలి. ఎందుకంటే అవి మాటల్లో ప్రతిబింబిస్తాయి.

చిన్నిపాప నవ్వు

వసంతమే వచ్చిందని
కోయిలమ్మ కూస్తుంది
వానజల్లు పడనుందని
నెమలి నాట్యమాడుతుంది

నల్లని మేఘాలు తొలగి
ఇంద్ర ధనస్సు మెరుస్తుంది
చినుకులందు తడిచిన
విత్తనమే మొలుస్తుంది

విరబూచిన పువ్వు చెంత
తుమ్మెద తిరుగాడుతుంది
దోరకాయ దొరికితేనే
చిలకమ్మ కొరుకుతుంది

నాన్న చెంత నుంటేనే
చిన్ని పాప నవ్వుతుంది
అమ్మ బువ్వ పెట్టగానే
మారామెంతో చేస్తుంది

అన్నతోటి ఆటలాడి
అలసి సొలసి పోతుంది
అమ్మమ్మ కథలు చెప్ప
వింటూ నిదురపోతుంది!

- కూచిమంచి నాగేంద్ర
91821 27880

తేడాలు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మల్లో ఐదు తేడాలున్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

కె. రాగ ప్రణీత,
8వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వర్షాకాలంలో ఇలా చేద్దాం ..!

ఈ కాలం వర్షాలను తెస్తుంది. వర్షాలతో పాటు అనారోగ్య సమస్యలనూ మోసుకొస్తుంది. మరి ఇంట్లోని పెద్దల, పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏం చేయాలి? చిన్న చిన్న జాగ్రత్తలతో, చిట్కాలతో మనం ఏవిధంగా సన్నద్ధం కావాలి?

చర్మం, జుట్టు సంరక్షణ : వర్షానికి తడిస్తే తొలుత ప్రభావం పడేది చర్మంతోపాటు వెంట్రుకల మీదే. తల తడిగా ఉన్నప్పుడు చుండ్రు అధికమవుతుంది. పేలూ పడతాయి. తలో చుండ్రు రావడం.. ఆ తర్వాత మొహంపై మొటిమలు రావడం జరుగుతుంది. ఇతర ఇన్ఫెక్షన్లు బాధించే అవకాశం కూడా ఉంది. అందుకే తల తడవకుండా గొడుగు లాంటివి ఉపయోగించాలి. తడిసి ఇంటికి వచ్చిన వెంటనే తలస్నానం చేయాలి.

కలుషిత ఆహారం వద్దు : వర్షాకాలంలో ఉండే అధిక తేమ జీర్ణశక్తిని తగ్గిస్తుంది. బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు, విష పదార్థాల వల్ల ఆహారం, నీరు కలుషితమవటంతో వివిధ అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే అవకాశం ఉంది. ఈ అనారోగ్య పరిస్థితులను వర్షాకాలంలో తప్పించుకోవటం అనివార్యమే. వైరస్ వ్యాప్తికి దోహదపడే కలుషిత ఆహారం, చల్లని పదార్థాలను తీసుకోవద్దు.

పరిసరాల పరిశుభ్రత : వర్షాకాలంలో శారీరకంగా, వ్యక్తిగతంగా జాగ్రత్తలు తీసుకోవడమే కాదు. ఇంటి పరిసరాల గురించి కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉండగలుగుతారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడటంతో ఇంట్లో కొన్ని వస్తువులు తేమగా ఉంటాయి. ఎక్కువ తడి, తేమ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

దోమలు, ఈగలు : వానాకాలంలో దోమలు, ఈగలు పెరుగుతాయి. కొన్ని రకాల జ్వరాలు, అంటువ్యాధుల వ్యాప్తికి అవే కారణం. మనం పరిసరాల్లో నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంట్లోగానీ ఇంటి పరిసరాల్లోగానీ దోమలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఫంగల్ ఇన్ఫెక్షన్లు : వర్షంలో తడిస్తే ఇంటికి రాగానే పాదాలను శుభ్రంగా కడుక్కోవాలి. ఆ తరువాత తడిలేకుండా తుడుచుకోవాలి. వర్షాకాలంలో ఎక్కువగా తడవడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్ సోకే అవకాశం ఉంది.

అంటువ్యాధులు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇంటికి రాగానే కాళ్ళను గోరు వెచ్చని నీటితో కడుక్కోవాలి.

ఎక్కువసార్లు బాగా కాచి వడపోసిన నీటిని తాగుతూ ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ మంచి నీటిని నేరుగా తాగటం మంచిది కాదు. జ్వరం వచ్చి రెండు రోజుల వరకు తగ్గకుండా ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి.

వేడి పదార్థాలను తీసుకోవాలి. వర్షాకాలంలో కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్ తీసుకోకూడదు.

పిల్లల ఆరోగ్యం జాగ్రత్త !

వర్షాకాలంలో చిన్నారులకు తరచూ జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. వర్షంలో తడవడం వల్ల తరచూ జలుబు, దగ్గు, జ్వరం లాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి. వర్షాకాలంలో చిన్నారులకు వేడి నీటితోనే స్నానం చేయించాలి. తలంటు స్నానం చేయించేటప్పుడు వేడి నీటిలో కొన్ని చుక్కల నువ్వుల నూనె వేయాలి. దీనివల్ల పిల్లల్లో శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. కొంచెం పసుపు, ఉప్పు కలిపిన మిశ్రమాన్ని చిన్నారులతో తినిపించాలి. తర్వాత గోరు వెచ్చని నీరు తాగించాలి. ఇలా చేస్తే జలుబు, దగ్గు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. గొంతు నొప్పి, దగ్గు సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు ఉప్పు, వాము, పసుపు కలిపి వేడి చేసి చిన్న గుడ్డలో కట్టుకోవాలి. దాంతో గొంతుపై నెమ్మదిగా కాపడం పెట్టాలి. ఇలా చేస్తే త్వరగా ఉపశమనం లభిస్తుంది.

పసుపు కొమ్ములు, గోధమలను సమాన మొత్తంలో తీసుకుని వాటిని నూనె లేకుండా దోరగా వేయించాలి. తర్వాత మెత్తని పొడిగా తయారు చేసుకోవాలి. ఈ పొడిని కొంత మొత్తంలో ఉదయం, సాయంత్రం పిల్లలకు ఇవ్వాలి. ఇలా చేస్తే శ్వాసకోశ సమస్యలు, దగ్గు తగ్గుతాయి.

వాము ఒక టీస్పూన్, బెల్లం 4 టీస్పూన్లు తీసుకుని వాటిని మెత్తగా నూరుకోవాలి. ఈ కషాయాన్ని పిల్లలతో తాగించాలి. ఇలా చేయడం వల్ల జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటివి తగ్గుతాయి.

ఇన్ఫెక్షన్‌తో ఇబ్బంది పడుతున్న చిన్నారులకు పసుపు, పటికబెల్లం పొడిని బొగ్గు నిప్పుపై వేసి చిన్నారులతో పట్టించాలి. ఇలా చేయడం వల్ల గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.

గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం, తేనె కలిపి పిల్లలతో తాగించాలి. ఇలా రోజుకు రెండు సార్లు తాగిస్తే మంచి ప్రయోజనం ఉంటుంది.

వారానికి కనీసం మూడు నాలుగు సార్లు ఆకుకూరలు తింటే ఎంతో మంచిది. ఉడకబెట్టిన సెనగలు, వేరుసెనగలు, అల్సందలు మొదలైన వాటిని వారానికి రెండు మూడుసార్లు స్నాక్‌లా తింటే మంచిది. వారానికి నాలుగసార్లు తెల్ల నువ్వుల ఉండలు, పల్లీ ఉండలు, సున్నుండలు తింటే వంటికి ఎంతోబలం.

సీజనల్‌గా దొరికే పండ్లను వారానికి రెండు మూడుసార్లు తింటే ఆరోగ్యం బాగా మెరుగుపడుతుంది. నానబెట్టిన బాదంపప్పును స్నాక్‌లాగా తినొచ్చు.

జీడిపప్పు, పిస్తాపప్పు వంటివి కూడా మంచిదే. కానీ పరిమితంగా మాత్రమే తినాలి.

ఉసిరికాయ, తానికాయ, కరక్కాయలను త్రిఫలాలు అంటారు. వీటితో త్రిఫల చూర్ణం తయారుచేస్తారు. వీటిలో విటమిన్-సి, ఫైటో కెమికల్స్, ఫైటో న్యూట్రియంట్స్, పాలీఫినాల్స్, అసెన్షియల్ ఆయిల్స్ ఉంటాయి. పోషకాల కంటే ఇందులో ఔషధ గుణాలే ఎక్కువ. ఈ చూర్ణాన్ని సమాన పరిణామంలో తీసుకుంటే ఉపయోగకరం.

- డాక్టర్ సుష్మ గుమ్మా,
సంపూర్ణ పోషక వైద్య నిపుణురాలు

ఉక్కుపాదంతో అణచివేస్తాం

- మంత్రి రాంబాబు

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

చట్టాన్ని ఎవరు అతిక్రమించినా సహించబోమని, ఉక్కుపాదంతో అణచివేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. పల్నాడు జిల్లా వినుకొండలో వైసిపి-టిడిపి ఘర్షణ నేపథ్యంలో పట్టణానికి వచ్చిన ఆయన వైసిపి కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. టిడిపి శ్రేణుల ద్వారా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై టిడిపి జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు దాడికి యత్నించారని విమర్శించారు. మట్టి అక్రమంగా తరలించారంటూ జివి, ఆయన అనుచరులు ఆందోళన చేయడమే కాకుండా బ్రహ్మనాయుడుకు చెందిన ఆవుల పరిశ్రమలోకి గోడలు దూకి వెళ్లి లోపలున్న వస్తువులనూ దొంగిలించారని ఆరోపించారు. టిడిపి ర్యాలీ చేస్తున్న మార్గంలో ఎమ్మెల్యే వెళ్లకూడదా? అని ప్రశ్నించారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి వెళుతున్న ఎమ్మెల్యే కారును అడ్డగించడం, ఆయనపై దాడి యత్నించడం సరికాదన్నారు. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు గాలిలోకి కాల్పులు జరపకుంటే పరిస్థితి ఇంకెలా ఉండేదో అర్థమవుతోందన్నారు. విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ఉద్యోగుల అసంతృప్తి : బండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, పిఆర్‌సి విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి ఉందని ఎపి ఎన్‌జిఒ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో శుక్రవారం ఎపి ఎన్‌జిఒ మహాసభల పోస్టర్‌ను చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆగస్టు 21, 22 తేదీల్లో ఉద్యోగుల సమస్యలపై నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరౌతారని తెలిపారు. గతంలో మహాసభలకు ముఖ్యమంత్రులు హాజరైనప్పుడు తమకు మేలు జరిగిందని, ఇప్పుడు కూడా సిఎం సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంఘం నేత శివారెడ్డి మాట్లాడుతూ తమ 71 డిమాండ్లపై ఇప్పటికే ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు.

కామన్ సర్వీస్ కేంద్రాలుగా ప్రాథమిక సహకార పరపతి సంఘాలు : సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కామన్ సర్వీస్ కేంద్రాలుగా తీర్చిదిద్దడంతోపాటు సహకార బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయాలని సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సహకార చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరించడంతోపాటు జాతీయ మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్నారు. విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో సిఎస్ అధ్యక్షతన అధికారులతో శుక్రవారం సమావేశం జరిగింది. వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి మాట్లాడుతూ సహకార సంఘాలను డిజిటిలైజేషన్ చేసేందుకు 60:40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.14.93 కోట్లు విడుదల చేశాయన్నారు. కంప్యూటరైజేషన్ పూర్తయితే పిఎసిఎస్‌లు బ్యాంక్ బ్రాంచ్‌లుగా బ్యాంకింగ్ సేవలు అందిస్తాయన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రపంచస్థాయి ధాన్యం నిల్వల కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలోని మృత్యుంజయ విశాల సహకార పరపతి సంఘం (ఎల్‌ఎస్‌సిఎస్) ఎంపికైనట్లు వివరించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార మంత్రిత్వశాఖ ద్వారా గుర్తించిన 300 సేవలను అందించేందుకు 1371 సంఘాలను అనుసంధానించగా, ఇప్పటికే 228 సంఘాలు కామన్ సర్వీస్ సేవలను అందిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎ.బాబు మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ, పశుసంవర్థకశాఖ స్పెషల్ సిఎస్ గోపాలకృష్ణ ద్వివేది, అదనపు సిసిఎల్‌ఎ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

ట్రాన్స్‌కో హెచ్చరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ట్రాన్స్‌కో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకం చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని ట్రాన్స్‌కో అదనపు కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. విద్యుత్ సౌధలోని చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్‌కు 17 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ తాను లేఖ రాసినట్లు ప్రచారం జరుగుతోందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన కార్యాలయం నుంచి అటువంటి లేఖ జారీ చేయలేదని, ఇది నకిలీదని పేర్కొన్నారు. ఆ పత్రంపై సంతకం చేసిన వారిపై తగు క్రిమినల్ చర్య తీసుకుంటామని తెలిపారు. ట్రాన్స్‌కో ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, అధికారులు, ప్రజలు ఇటువంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలు, నకిలీ లేఖలపై అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌కోకు సంబంధించిన శాశ్వత ప్రాతిపదికన తీసుకునే నియామకాలు, ఉద్యోగ ప్రకటనలు విద్యుత్ సంస్థల అధికారిక వెబ్‌సైట్‌లో, ప్రింట్ మీడియా ద్వారా మాత్రమే ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల సేవలను థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా మాత్రమే తీసుకుంటామన్నారు.

వలంటీర్లతో వెట్టిచాకిరీ

యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఇంజనీరింగ్, పిజి చేసిన యువతకు వలంటీర్ ఉద్యోగాలిచ్చి.. వారితో సిఎం జగన్ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ఒంగోలులో కొనసాగింది. నగరంలోని మంగమ్మ కాలేజీ జంక్షన్‌లో నిరుద్యోగ యువకులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రతియేటా జాబ్ కేలండర్ ఇస్తామని చెప్పి జగన్మోహన్‌రెడ్డి తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. లోకేష్ స్పందిస్తూ.. జగన్ మాయమాటలు నమ్మి మోసపోయిన యువకులు నిరాశ, నిస్పృహతో సుమారు 470 మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే జాబ్ కేలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు యువగళం పథకం ద్వారా ప్రతినెలా రూ.మూడు వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు, స్వయం ఉపాధి రంగాల ద్వారా 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ప్రకాశం జిల్లాను ఫార్మా హబ్‌గా తీర్చిదిద్ది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, వలసలను నివారిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు క్యాంపు సైట్ వద్ద గ్రానైట్ రంగ ప్రతినిధులతో లోకేష్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రానైట్ రంగ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రానైట్ పరిశ్రమపై రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది ఆధారపడి ఉన్నారని, అలాంటి రంగాన్ని జగన్ దెబ్బకొట్టాడన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ పెంచిన పన్నులు తగ్గించి.. ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని కాపాడతామని, పెట్రోల్, డీజిల్ పై పన్నులు తగ్గించి ధరలు తగ్గిస్తామని, మెరుగైన గ్రానైట్ పాలసీ తీసుకువస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. పాదయాత్రలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రానైట్ రంగ ప్రతినిధులతో మాట్లాడుతున్న లోకేష్

సిరీస్‌పై గురి

- బెంచ్‌కు అవకాశం దక్కేనా..?
- వెస్టిండీస్‌తో రెండో వన్డే నేడు..

రాత్రి 7.00గం॥ల నుంచి

బార్బొడాస్: తొలి వన్డేలో నెగ్గిన టీమిండియా ఇక సిరీస్‌పై గురిపెట్టింది. తొలి వన్డేలో 5వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన టీమిండియా వెస్టిండీస్‌తో శనివారం జరిగే రెండో వన్డేలోనూ నెగ్గి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలన్ని చూస్తోంది. ఏకపక్షంగా సాగిన తొలి వన్డేలో స్పిన్నర్లు కుల్దీప్, జడేజా దెబ్బకు విండీస్ బ్యాటర్స్ చేతులెత్తేశారు. టీమిండియా కాంబినేషన్.. కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు రాహుల్ ద్రవిడ్‌కు సవాల్‌గా మారింది. వన్డే ప్రపంచకప్ ముందు ఆటగాళ్ల సత్తాకు పరీక్షగా ఈ సిరీస్ నిలుస్తోంది. ఈ క్రమంలోనే బెంచ్ ఆటగాళ్లకు చోటివ్వాలా? సీనియర్ ఆటగాళ్లనే కొనసాగించాలా? అనేది టీమిండియా మేనేజ్‌మెంట్ తేల్చుకోలేకపోతోంది. వెటరన్ వికెట్ కీపర్ సంజూ శాంసన్‌తో పాటు జయదేవ్ ఉనాద్కత్‌లను ఆడించాల్సిన అవసరం ఉంది. ఈ ఇద్దరిని జట్టులోకి తీసుకుంటే కీలక ఆటగాళ్లను పక్కనపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. జట్టులో మార్పులు చేయాలని భావిస్తే టీమిండియా మేనేజ్‌మెంట్ విరాట్ కోహ్లీతో పాటు శార్దూల్ ఠాకూర్, రవీంద్ర జడేజాలాకు విశ్రాంతి ఇవ్వాల్సి ఉంటుంది. మరోవైపు తొలి వన్డేలో చిత్తుగా ఓడిన వెస్టిండీస్.. కనీస పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. బలహీనంగా ఉన్న బ్యాటింగ్ లైనప్‌ను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది.

పరాజయానికి కారణం అదే: షాయ్ హోప్

పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు ఓపికగా బ్యాటింగ్ చేయకపోవడమే టీమిండియాతో తొలి వన్డేలో తమ ఘోర పరాజయానికి ప్రధాన కారణమని వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అన్నాడు. తొలి వన్డే ఓటమిపై మాట్లాడటానికి ఏమీ లేదని, తమ దృష్టంతా రెండో వన్డేపైనే ఉందని తెలిపాడు. పరుగులు రాబట్టాలంటే కాస్త ఓపికగా బ్యాటింగ్ చేయాలని, కానీ తమ బ్యాటింగ్‌లో అదే లోపించిందని చెప్పుకొచ్చాడు.

సెమీస్‌కు లక్ష్యసేన్

- క్వార్టర్స్‌లో ఓడిన ప్రణయ్, సాత్విక్-చిరాగ్ జోడీ
- జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి యువ షట్లర్ లక్ష్యసేన్ దూసుకెళ్లగా.. హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఇంటిదారి పట్టింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 21-15, 21-19తో వటనబే(జపాన్)పై వరుససెట్లలో గెలుపొందాడు. సెమీస్‌లో ఇండోనేషియా ఆటగాడు జొనాథన్ క్రిస్టీతో లక్ష్యసేన్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మరో క్వార్టర్‌ఫైనల్లో ప్రణయ్ రాయ్ 21-19, 18-21, 8-21తో టాప్‌సీడ్ విక్టర్ అక్సెల్సన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడాడు.

సాత్విక్-చిరాగ్ జోరుకు బ్రేక్..

భారత స్టార్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జైత్రయాత్రకు బ్రేక్ పడింది. వరుసగా 12 విజయాలతో జోరు మీదున్న వీరు ఒలింపిక్ విజేతలైన లీయాంగ్-వాంగ్ చీ లిన్ చేతిలో పోరాడి ఓడారు. సుమారు గంట పది నిమిషాలు జరిగిన మ్యాచ్‌లో 15-21, 25-23, 16-21తో అనూహ్యంగా పరాజయం చెందారు. ఇక మహిళల సింగిల్ సెమీస్‌కు తైజు-యింగ్(తైపీ), సన్-యే యంగ్(కొరియా)తోపాటు టంగ్‌జంగ్(మలేషియా), హీ-బింగ్జియావో(చైనా) దూసుకెళ్లారు.

సౌత్‌జోన్ హ్యాట్రిక్

వరుసగా మూడో మ్యాచ్‌లోనూ గెలుపు • దేవధర్ ట్రోఫీ

పుదుచ్చేరి: దేవధర్ ట్రోఫీలో సౌత్‌జోన్ జైత్రయాత్ర కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన రౌండ్-3 లీగ్ మ్యాచ్‌లో సౌత్‌జోన్ జట్టు 9వికెట్ల తేడాతో నార్త్-ఈస్ట్-జోన్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సౌత్-ఈస్ట్-జోన్ బ్యాటర్స్‌ను సౌత్‌జోన్ బౌలర్లు సాయికిషోర్(3/22), కరియప్ప(3/27), రోహిత్ రాయుడు(1/8) దెబ్బకు 49.2ఓవర్లలో 136పరుగులకే కుప్పకూలింది. ప్రియజ్యోత్(40) టాప్‌స్కోరర్. ఛేదనలో సౌత్‌జోన్ జట్టు 19.3ఓవర్లలో మయాంక్ అగర్వాల్(32) వికెట్ కోల్పోయి ఛేదించింది. మరో ఓపెనర్ రోహన్(87నాటౌట్), జగదీశన్(15నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. ఈ గెలుపులో సౌత్‌జోన్ జట్టు 12పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇతర పోటీల్లో ఈస్ట్‌జోన్ జట్టు 88పరుగుల తేడాతో నార్త్‌జోన్‌పై, సెంట్రల్ జోన్ జట్టు వెస్ట్‌జోన్‌పై గెలిచాయి. ఆదివారం జరిగే నాల్గో లీగ్ మ్యాచ్‌లో ఈస్ట్‌జోన్ జట్టు సౌత్‌జోన్‌తో, సెంట్రల్ జోన్ జట్టు నార్త్-ఈస్ట్-జోన్‌తో, నార్త్‌జోన్ జట్టు-వెస్ట్‌జోన్‌తో తలపడనున్నాయి.

ఆసియా క్రీడల క్రికెట్‌లో నేరుగా క్వార్టర్స్‌కు..

హాంగ్జో: ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్‌కు చేరాయి. ఆసియాకు చెందిన టాప్-4 జట్లకు నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు ఎంట్రీ లభించింది. భారత్‌తో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లకు కూడా క్వార్టర్స్ బెర్తు దక్కింది. భారత పురుషుల మ్యాచ్‌లు సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 7వరకు, మహిళల మ్యాచ్‌లు సెప్టెంబర్ 19నుంచి 26వరకు జరుగుతాయి. పురుషుల విభాగంలో మొత్తం 18 జట్లు పోటీ పడనుండగా, మహిళల విభాగంలో 14జట్లు పతకాలకు పోటీ పడనున్నాయి.

ఆస్ట్రేలియా 295ఆలౌట్

ఓవల్: యాషెస్ సిరీస్ చివరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టుకు 12 పరుగుల ఆధిక్యత లభించింది. సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్(71), కమిన్స్(36), మర్ఫీ(34) ఆదుకున్నాడు. దీంతో ఆస్ట్రేలియా 103.01ఓవర్లలో 295పరుగులకు ఆలౌటైంది. వోక్స్‌కు మూడు, బ్రాడ్, వుడ్, రూట్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

ఓపెనర్లే బాదేశారు..

ఐర్లాండ్ మహిళలపై 10వికెట్ల తేడాతో ఆసీస్ గెలుపు

పోర్ట్స్‌స్ట్రోమ్: ఐర్లాండ్ మహిళలతో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా మహిళల జట్టు సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. ఐర్లాండ్ నిర్దేశించిన 218పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఓపెనర్లే ఛేదించారు. లిచ్‌ఫెల్డ్(106), సథర్లాండ్(109) అజేయ సెంచరీలతో కదం తొక్కారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 49ఓవర్లలో 217పరుగులకు ఆలౌటైంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68